

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 24-02-2026 | సంపుటి - 26 | సంచిక -276 | రూ : 4 | పేజీలు: 8




మార్చిలోగా

## ప్రభుత్వం చేతికి మెట్రో

- ఐఆర్ఎఫ్‌సీ నుంచి రుణ సమీకరణ
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంలో ఫేజ్-2

హైదరాబాద్: హైదరాబాద్ మెట్రోరైలు ప్రాజెక్టు ప్రభుత్వప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) నుంచి పూర్తిగా ప్రభుత్వ పరిధిలోకి రానుంది. ఎల్అండ్‌టీ సంస్థకు ఇవ్వాల్సిన మొత్తాన్ని చెల్లించి, మార్చిలోగా ఈ ప్రక్రియను పూర్తి చేసే బాధ్యతను ప్రభుత్వం కార్యదర్శుల కమిటీకి అప్పగించింది. ఈ స్వాధీనానికి అవసరమైన రుణాన్ని సమకూర్చేందుకు ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్‌సీ) ముందుకు వచ్చింది. ఈ నెల 27 నాటికి రుణ నిబంధనలు వెల్లడించనుంది. స్వాధీన ప్రక్రియ కొనసాగిస్తూ.. మెట్రోరైలు ఫేజ్ 2ఏ, 2బీ

తరువాయి 2లో

ఉద్యోగులకు

# తీపి కబురు..

- రూ.1.20 కోట్ల ప్రమాద బీమా.. పెన్షనర్లకూ వర్తింపు
- సహజ మరణానికి 60 ఏళ్ల వరకూ రూ.10 లక్షల టర్మ్ ఇన్సూరెన్స్
- రూ.1,056 కోట్లతో ఉద్యోగుల ఆరోగ్య పథకం
- ప్రభుత్వ అధీనంలోకి మెట్రో రైలు.. హైదరాబాద్‌కు వరాలు
- మార్చి 16 నుంచి అసెంబ్లీ సమావేశాలు.. 20న బడ్జెట్

2లో






## ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రహార్

- కీలక విధానాన్ని ప్రకటించిన కేంద్రం

దిల్లీ: కేంద్ర ప్రభుత్వం సోమవారం ''ప్రహార్'' పేరుతో దేశంలో తొలి ఉగ్రవాద నిర్మూలన విధానానికి తెరతీసింది. బహుముఖ వ్యూహాన్ని అవలంబిస్తూ ఉగ్రవాదం పట్ల ఏమాత్రం సహనం వహించరాదన్నది ఈ విధానంలోని ప్రధాన అంశం. నిఘా ఆధారంగా ఉగ్రవాద హింసను నిరోధించడం, ఉగ్రవాదులకు, వారికి ఆర్థిక సాయం చేసేవారికి, మద్దతు దారులకు నిధులు, ఆయుధాలు, ఆశ్రయం

తరువాయి 2లో



వైకాపా పాలనలో జగన్ కంపెనీలకు..

## రూ.వెయ్యి కోట్లకు పైగా అనుచిత లబ్ధి

- ఇన్నేళ్ల తెదేపా పాలనలో హెరిటేజ్‌కు ఒక్క రూపాయీ తీసుకోలేదు
- హెరిటేజ్‌పై బొత్స వ్యాఖ్యలు అర్థరహితం
- మంత్రి లోకేశ్ ధ్వజం

2లో

## అట్టుడికిన మెక్సికో

- డ్రగ్స్ మాఫియా డాన్ ఎల్ మెంచో హతం
- అనంతరం రెచ్చిపోయిన అతడి అనుచరులు
- 25 మంది నేషనల్ గార్డ్ సభ్యుల హత్య
- సైన్యం కాల్పుల్లో 62 మంది డ్రగ్స్ ముఠా సభ్యుల మృతి!



2లో



రాఫెల్ ఒప్పందంలో

## మరింత జాప్యం ?

- రిలయన్స్ పాత్రపై అస్పష్టత
- అనిల్ అంబానీ ఆర్థిక కార్యకలాపాలపై నిఘా
- సోర్స్ కోడ్స్ బదిలీకి ఫ్రాన్స్ 'నో'

2లో

స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే

## బీసీ రిజర్వేషన్ల పెంపు

- ఏకసభ్య కమిషన్ నివేదిక రాగానే చట్టం చేసి అమలు చేస్తాం
- ఇది బలహీనవర్గాల ప్రభుత్వం
- శాసనసభలో సీఎం చంద్రబాబు

2లో





సజావుగా ఇంటర్మీడియట్

## పరీక్షలు

- తొలి రోజు 5.24 లక్షల మంది హాజరు

అమరావతి: రాష్ట్రంలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభం అయ్యాయి. తొలిరోజు మొదటి సంవత్సరం విద్యార్థులకు పార్ట్ 11: ద్వితీయ భాష పేపర్ 1 నిర్వహించారు. మొత్తం 5,45,028 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా.. 5,24,905 మంది హాజరయ్యారు. 20,123 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. తొలిరోజు చూచిరాత కేసులు నమోదు కాలేదని, ప్రశాంతంగా పరీక్షలు జరిగాయని ఇంటర్మీడియట్

తరువాయి 2లో

బాగా పనిచేసే ఉద్యోగులకు

# వెయిటేజ్

- అభినందన లేఖలతోపాటు, వారి వ్యక్తిగత రికార్డుల్లో నమోదు
- రెవెన్యూశాఖకు ఉన్న చెడ్డపేరు పోవాలి
- ఏసీబీని క్రియాశీలం చేసే పరిస్థితి తెచ్చుకోవద్దు
- ఆసుపత్రుల పారిశుద్ధ్యంలో అశ్రద్ధ చూపితే ఏజెన్సీలు, ఏవోలే బాధ్యులు
- వివిధ శాఖల పనితీరుపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి



2లో

# ఉద్యోగులకు తీపి కబురు

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పింఛనుదారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని మంత్రివర్గం తీపి కబురు ప్రకటించింది. ఆదర్శవంతమైన రెండు కొత్త పథకాలు అమలు చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రూ.1.20 కోట్ల ప్రమాద బీమాను వర్తింపజేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. రూ.1,056 కోట్ల మూలనిధితో ఉద్యోగుల, పెన్షనర్ల ఆరోగ్య పథకానికి క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. ఇందులో 652 గుర్తింపు పొందిన ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో 1,998 వ్యాధులకు నగదు రహిత చికిత్సలను పొందే వెసులుబాటు కల్పించింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం మంత్రివర్గ సమావేశం జరిగింది. సుమారు 5 గంటలకు పైగా జరిగిన క్యాబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మీడియా సమావేశంలో ఈ వివరాలను మంత్రులు వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లతో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. మార్చి 16 నుంచి శాసనసభ సమావేశాలు ప్రారంభమవుతాయని తెలిపారు. 16న ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగం, 20న రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెడతారని మంత్రి వివరించారు.

*** ఉద్యోగులపై భారం లేకుండా ప్రమాద బీమా**

"దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు పెన్షనర్లకు ప్రమాద బీమా పథకం అమలు చేయనున్నాం. ఉద్యోగుల నుంచి ఒక్క రూపాయి ప్రీమియం కూడా తీసుకోవడం లేదు. ప్రభుత్వం తొలుత సింగరేణి, ట్రాన్స్‌కోలో ఈ పథకాన్ని విజయవంతంగా అమలు చేసింది. ఒకవేళ ఎవరైనా ప్రమాదంలో మరణిస్తే రూ.1.2 కోట్ల పరిహారం అందుతుంది. సహజ మరణానికి 60 ఏళ్ల వరకు ఉద్యోగులకు రూ.10 లక్షల టర్మ్ ఇన్సూరెన్స్ వర్తిస్తుంది. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రభుత్వ కార్పొరేషన్లు, ప్రభుత్వ రంగ సంస్థల పరిధిలో 5.19 లక్షల మంది రెగ్యులర్ ఉద్యోగులున్నారు. వీరితో పాటు 2.38 లక్షల మంది పెన్షనర్లున్నారు. మొత్తం 7.57 లక్షల మందికి ఈ ప్రమాద బీమా వర్తిస్తుంది. అటు ఉద్యోగులు, ఇటు ప్రభుత్వంపై ఎలాంటి భారం లేకుండా బ్యాంకర్ల ద్వారా బీమా అమలు చేయాలని రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయించింది. ఇటీవల ఉద్యోగులు, పెన్షనర్లు సరైన సమయంలో వారికి రావాల్సిన బెనిఫిట్స్‌ను పొందలేకపోవడంతో జరిగిన కొన్ని దుర్ఘటనలపై కూడా క్యాబినెట్ చర్చించింది. భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూడాలని నిర్ణయించింది.

**మరికొన్ని కీలక నిర్ణయాలు**

- * వైద్య ఆరోగ్య శాఖలో కీలక సంస్కరణలు చేపట్టాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. రాష్ట్రంలో వివిధ విభాగాల పరిధిలోని అన్ని ఆసుపత్రుల నిర్వహణ సమర్థంగా జరిగేలా చర్యలు చేపట్టాలని చర్చించింది. అవసరమైన కొత్త విధానాలపై అధ్యయనం చేసేందుకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆధ్వర్యంలో.. ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. ప్రభుత్వ సలహాదారు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు, డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డిని కమిటీలో నియమించి వారి సలహాలు సూచనలు తీసుకుంటారు. ఆసుపత్రుల నిర్వహణను పకడ్బందీగా చేపట్టేందుకు.. ఆసుపత్రుల్లో మెడికల్ సర్వీసెస్‌ను, అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్‌ను.. వేరుగా విభజించే ప్రత్యామ్నాయాలను కూడా పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు.
- * హైదరాబాద్ మెట్రోను ప్రభుత్వం తీసుకునేందుకు క్యాబినెట్ ఆమోదించింది.
- * రంగారెడ్డి జిల్లా కోహెడలో మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్కు, ఫుడ్ ప్రాసెసింగ్ పార్కు ఏర్పాటు చేయాలని .. అందుకు అవసరమైన 223.09 ఎకరాల భూమిని టీజీఐఐసీకి బదలాయించాలని నిర్ణయించింది.
- * ప్రపంచ స్థాయి ప్రమాణాలతో పండ్ల మార్కెట్ ఏర్పాటుకు టీజీ హౌసింగ్ బోర్డు అధీనంలోని 239 ఎకరాలను వ్యవసాయ మార్కెటింగ్ విభాగానికి బదలాయింపు.
- * మహబూబాబాద్ జిల్లా మహబూబాబాద్ మండలం గుమ్మడూరులో జేఎన్టీయూ ఆధ్వర్యంలోని ఇంజినీరింగ్ కాలేజీకి 70 ఎకరాలు, శాతవాహన యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ కాలేజీ నిర్మాణానికి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం ఉమ్మాపూర్లో 36 ఎకరాలను కేటాయించింది.

# ఎవరికి వారే..

న్యూఢిల్లీ : భారత్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ - 2026 ఆశలు, ఆందోళనలు, వివాదాల మధ్య ముగిసింది. కృత్రిమ మేధస్సు (ఏఐ) రంగంలో భారత్ తన నాయకత్వాన్ని చాటుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్న ఈ సమ్మిట్, నిర్వహణ లోపాలు, ప్రముఖుల గైర్హాజరు, ఏఐ వల్ల తలెత్తే సామాజిక సవాళ్లపై లోతైన చర్చల కొరత వంటి అంశాలతో తీవ్ర విమర్శలను ఎదుర్కొంది. ముఖ్యంగా, ప్రజలను తప్పుదోవ పట్టించే డీప్‌ఫేక్‌లు, తప్పుడు సమాచారం వంటి అంశాలపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఈ అంశాలే సమ్మిట్ చర్చలకు ప్రధానాంశంగా మారాయి. అయితే ఈ సదస్సుకు బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డిసెల్వా, శ్రీలంక అధ్యక్షుడు విక్రమ నాయకే, ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్, తదితర దేశ నాయకులు ప్రముఖ కంపెనీల సీఈఓలు పాల్గొన్నారు. ఢిల్లీ డిక్లరేషన్‌పై 88 దేశాలు సంతకాలు చేశాయని, 250 బిలియన్ల డాలర్ల పెట్టుబడులకు హామీలు వచ్చాయని, ఈ శిఖరాగ్ర సదస్సులో దాదాపు 5 లక్షల మంది పాల్గొన్నారని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు.

*** చుట్టుముట్టిన వివాదాలు, నిర్వహణా లోపాలు**

సమ్మిట్ ప్రారంభం నుంచే పలు వివాదాలు, నిర్వహణా లోపాలు దీని ప్రతిష్టను దెబ్బతీశాయి. భారత్ మండపంలో జరిగిన ఈ సమ్మిట్‌లో మొదటిరోజు నుంచే భారీ క్యూలు, గందరగోళం నెలకొంది. అనేక గేట్లు మూసివేయడం, సరైన సమాచారం లేకపోవడంతో ప్రతినిధులు గంటల తరబడి బయటే ఉండిపోయారు. బెంగళూరుకు చెందిన పారిశ్రామికవేత్త ధనుంజయ యాదవ్ తన వేర్‌బుల్ వస్తువులను దొంగలించారని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అనంతరం పోలీసులు దొంగను పట్టుకుని, వస్తువులు అయనకు అందజేశారు. ఎగ్జిబిటర్ల తరలింపు మరో వివాదానికి దారితీసింది. ప్రధాని మోడీ పర్యటనకు ముందు ఎగ్జిబిటర్లను ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా ఖాళీ చేయించారు. వారికి కనీసం నీరు, ఆహారం ఎక్కడ దొరుకుతాయో చెప్పే సైన్ బోర్డులు కూడా లేకపోవడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. టెక్ సమ్మిట్ అయినప్పటికీ, ఇంటర్నెట్ కనెక్టివిటీ సరిగా లేకపోవడంతో డిజిటల్ చెల్లింపులు వైఫల్యం చెందాయి. దీంతో స్టాల్స్ వద్ద నగదు మాత్రమే తీసుకున్నారు.

# మార్చిలోగా ప్రభుత్వం చేతికి మెట్రో

హైదరాబాద్: హైదరాబాద్ మెట్రోరైలు ప్రాజెక్టు ప్రభుత్వప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) నుంచి పూర్తిగా ప్రభుత్వ పరిధిలోకి రానుంది. ఎల్అండ్‌టీ సంస్థకు ఇవ్వాల్సిన మొత్తాన్ని చెల్లించి, మార్చిలోగా ఈ ప్రక్రియను పూర్తి చేసే బాధ్యతను ప్రభుత్వం కార్యదర్శుల కమిటీకి అప్పగించింది. ఈ స్వాధీనానికి అవసరమైన రుణాన్ని సమకూర్చేందుకు ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్‌సీ) ముందుకు వచ్చింది. ఈ నెల 27 నాటికి రుణ నిబంధనలు వెల్లడించనుంది. స్వాధీన ప్రక్రియ కొనసాగిస్తూ.. మెట్రోరైలు ఫేజ్ 2ఏ, 2బీ మంజూరు కోసం కేంద్ర పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖతో రాష్ట్ర పురపాలకశాఖ చర్చలు జరిపి ఆమోదం తీసుకోవాలని ఇప్పటికే ప్రభుత్వం సూచించింది. మెట్రోరైలు నిర్వహిస్తున్న కియోలిస్ సంస్థ ఒప్పంద కాలపరిమితి 2026 నవంబరు 27తో ముగియనుంది. స్వాధీనం పూర్తయిన తరువాత కూడా మరో ఏడాది పాటు అదే సంస్థ నిర్వహణ కొనసాగించనుంది.

**కార్యదర్శుల కమిటీ నివేదిక**

మెట్రోరైలు స్వాధీనం కోసం ప్రభుత్వం సీఎస్ ఆధ్వర్యంలో కార్యదర్శుల కమిటీని నియమించింది. ఈ కమిటీ మెట్రోరైలు రెండోదశ ముందుకు వెళ్లాలంటే.. తొలిదశ పూర్తిగా ప్రభుత్వ అధీనంలోనే ఉండాలని, తద్వారా సంస్థ మనుగడ సాధ్యమని తెలిపింది. మెట్రోరైలు విధానం 2017, ఫేజ్ 2 అనుమతులకు పట్టణ వ్యవహారాలశాఖ నిబంధనలు, మెట్రోరైలు వ్యవస్థల్లో అంతర్జాతీయ అనుభవాలు, వేర్వేరు యాజమాన్యాల కింద ప్రాజెక్టుల నిర్వహణ, ప్రయాణికుల అనుభవాలు, దీర్ఘకాల ఆర్థిక సుస్థిరత అంశాలను పరిగణనలోకి తీసుకుంది. ఎల్అండ్‌టీ మెట్రోరైలులో మొత్తం వాటా తీసుకుని, స్వాధీనం చేసుకోవాలని కార్యదర్శుల కమిటీ ఏకగ్రీవంగా ఆమోదించింది. స్వాధీనంలో జరిగే ఆలస్యంతో మెట్రో ఫేజ్ 2 ప్రాజెక్టు వ్యయం ఏటా 5శాతం పెరిగే అవకాశముందని తెలిపింది. మరోవైపు ఎల్అండ్‌టీ సంస్థ డెఫినెటివ్ ఒప్పందంపై సంతకం చేయనందున యాజమాన్య విభజన సాధ్యం కాదని అభిప్రాయపడింది. ఆస్తులు, వ్యాపారానికి బదులుగా సంస్థలో ఈక్విటీని కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఇదే సమయంలో అప్పులు, బీటీఏ నిబంధన, ఫలక్‌నుమా కారిడార్ అడ్డంకులు, కేంద్రంనుంచి వీజీఎఫ్ బకాయిలున్నట్లు గుర్తించింది. ఆ మేరకు ప్రభుత్వానికి నివేదిక అందజేసింది.

# రాఫెల్ ఒప్పందంలో మరింత జాప్యం ?

చండీగఢ్ : భారత వైమానిక దళం కోసం 114 డస్సాల్ట్ రాఫెల్ యుద్ధ విమానాలను సిద్ధం చేసేందుకు రక్షణ మంత్రిత్వ శాఖ ఇటీవల పచ్చజెండా ఊపిన విషయం తెలిసిందే. అయితే వీటిలో అధిక భాగం విమానాలను దేశీయంగానే ఉత్పత్తి చేసేందుకు వీలుగా నాగపూర్‌లోని డస్సాల్ట్ ఏరోస్పేస్ లిమిటెడ్ (డీఆర్ఏఎల్)లో తాత్కాలికంగా ఏర్పాట్లు చేశారు. బహుళ ప్రయోజక ఫైటర్ జెట్ విమానాల (ఎంఆర్ఎఫ్ఏ) కొనుగోలు కోసం రూపొందించుకున్న కార్యక్రమాన్ని నిరవధికంగా వాయిదా వేస్తూ వస్తున్న కేంద్ర ప్రభుత్వం తాజాగా రాఫెల్ విమాన ప్రతిపాదనను ముందుకు తెచ్చింది. రాఫెల్ యుద్ధ విమానాల సేకరణకు సంబంధించి కేవలం కొన్ని వివరాలు మాత్రమే బయటికి వచ్చాయి. అయితే రెండు ఇంజన్లు ఉండే ఈ ఫ్రాన్స్ విమానాలలో 96 విమానాలను డీఆర్ఏఎల్‌లోనే నిర్మిస్తారని, మిగిలిన 18 విమానాలు ఫ్రాన్స్ నుంచి దిగుమతి అవుతాయని అంటున్నారు.

# వైకాపా పాలనలో జగన్ కంపెనీలకు..రూ.వెయ్యి కోట్లకు పైగా అనుచిత లబ్ధి

అమరావతి: వైకాపా అధికారంలో ఉన్న ఐదేళ్లలో సాక్షి పత్రిక, టీవీ ఛానల్, భారతి సిమెంట్స్ సహా జగన్ కంపెనీలు ప్రభుత్వం నుంచి రూ.వెయ్యి కోట్లకు పైగా అనుచిత లబ్ధి పొందాయని విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. తెదేపా అధికారంలో ఉన్న ఇన్నేళ్లలో ప్రభుత్వం నుంచి హెరిటేజ్ ఒక్క రూపాయి కూడా లబ్ధి పొందలేదని తెలిపారు. ఏపీ సహా ఏ రాష్ట్ర ప్రభుత్వంతోనూ వ్యాపారం చేయరాదన్నది హెరిటేజ్ విధానమని స్పష్టంచేశారు. లోకేశ్ సోమవారం శాసనసభ లాబీల్లో మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. 'ఇందాపూర్ డెయిరీ.. హెరిటేజ్‌కు కోకంపెనీ అని బొత్స సత్యనారాయణ ఆరోపించడం విడ్డూరంగా ఉంది. కోకంపెనీ అన్నదే ఉండదన్న విషయం అంత సీనియర్ నేతకు తెలియదా? ఇందాపూర్ డెయిరీ హెరిటేజ్ కంటే చాలా పెద్దది. ఆ సంస్థ ఉత్పత్తుల్లో 30% మాత్రమే రీటెయిల్‌గా విక్రయిస్తుంది. మిగతా 70% ఉత్పత్తులను పెద్ద కంపెనీల కోసం తయారుచేస్తుంది. హెరిటేజ్‌తో పాటు అమూల్, బ్రిటానియా వంటి సంస్థలకు కావలసిన పాల ఉత్పత్తుల్ని తయారుచేసి ఇస్తుంది. దాన్ని కో ప్యాకేజింగ్ అంటారు' అని ఆయన వివరించారు. ఇందాపూర్ డెయిరీ నుంచి హెరిటేజ్ ఎప్పుడూ నెయ్యి కొనుగోలు చేయదని, స్కిమ్డ్ మిల్క్‌పౌడర్, అల్ట్రా హైటెంపరేచర్ మిల్క్ (యూహెచ్‌టీ), పన్నీర్, చీజ్ మాత్రమే ఆ డెయిరీ సరఫరా చేస్తుందని లోకేశ్ తెలిపారు. 'హెరిటేజ్ లిస్టెడ్ కంపెనీ. మా సంస్థపై వైకాపా నాయకులు సెబీకి ఫిర్యాదు చేశారు. ఏమైనా ఆధారాలు చూపించగలిగారా?' అని నిలదీశారు. 'సంబంధం లేని విషయంతో నాలుగు రోజులు శాసనమండలి సమావేశాలు జరగకుండా అడ్డుపడ్డ వైకాపా సభ్యులు.. ఇప్పుడు బడ్జెట్‌పై చర్చించాలని కోరడంలో అర్థం లేదు. సమావేశాల్ని అడ్డుకున్నప్పుడు వారికా విషయం తెలియదా?' అని లోకేశ్ ప్రశ్నించారు. తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంపై మంగళవారం శాసనసభలో చర్చిస్తామని తెలిపారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే బీసీ రిజర్వేషన్ల పెంపు

అమరావతి: స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే బీసీ రిజర్వేషన్లు పెంచుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. "ఎన్డీయేపై ఎంతో నమ్మకంతో ఓట్లేసి గెలిపించారు. ఆ నమ్మకాన్ని కాపాడుకోవాలి. వైకాపా హయాంలో బీసీ రిజర్వేషన్లు 33% నుంచి తగ్గించారు. మళ్లీ వాటిని పెంచడానికి ఏకసభ్య కమిషన్ వేశాం. నివేదిక రాగానే చట్టం చేసి అమలుచేస్తాం. బీసీల రక్షణకు మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటుచేశాం. వారిచ్చే నివేదికను అమలుచేస్తాం. బీసీ వర్గాల్లోని కొందరు తమను ఎస్సీ, ఎస్టీల్లో చేర్చాలని కోరారు. వాటిని కేంద్రానికి పంపాం" అని తెలిపారు. "బలహీనవర్గాల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తాం. ప్రజాప్రతినిధులు ఏ పనిచేసినా.. దాని ద్వారా బలహీనవర్గాల్ని ఎంతవరకు ఆదుకుంటున్నామన్న సంగతిని దృష్టిలో ఉంచుకోవాలి. ఇది బలహీనవర్గాల ప్రభుత్వం.. వారికి అన్నివిధాలా అండగా ఉంటాం" అని వెల్లడించారు. శాసనసభలో సోమవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖలతోపాటు ఆహార పౌరసరఫరాలశాఖకు 202627 ఆర్థిక సంవత్సరానికి గ్రాంట్ల కోసం అభ్యర్థనపై చర్చ తర్వాత చంద్రబాబు మాట్లాడారు. "ఎస్సీ వర్గీకరణ 199697లో తొలిసారిగా తెదేపా ప్రభుత్వమే తెచ్చింది. తర్వాత వచ్చిన ప్రభుత్వాలు దాన్ని కాపాడలేకపోయాయి. సుప్రీంకోర్టు అనుమతివ్వడంతో.. మళ్లీ ఎస్సీ వర్గీకరణ అమలు చేసి.. దామాషా ప్రకారం సామాజిక న్యాయం చేశాం" అని వివరించారు.

*** గిరిజనుల సమస్యకు ఆమోదయోగ్య విధానంలో పరిష్కారం**

గిరిజనుల అభ్యున్నతికి జీవో 3 (గిరిజన ప్రాంతాల్లో 100% ఉద్యోగాలు స్థానిక గిరిజనులకే కల్పించేలా) తెచ్చినట్లు చంద్రబాబు తెలిపారు. దానిని వైకాపా వాళ్లు కాపాడలేకపోయారని, సుప్రీంకోర్టులో దీన్ని కొట్టేశారని చెప్పారు. ఆచరణ, ఆమోదయోగ్యమైన విధానంలో ఈ సమస్యకు పరిష్కారం చూపడానికి సిద్ధంగా ఉన్నట్లు స్పష్టంచేశారు. ఈ అంశంపై సమావేశాలు పెట్టాలని అధికారులను ఆదేశించామని, అందులో వచ్చే సూచనల ఆధారంగా నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. చంద్రబాబు ప్రసంగంలోని ముఖ్యాంశాలు..

**సంక్షేమానికి బడ్జెట్ పెంచాం**

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు వీలైనంత వరకు బడ్జెట్ పెంచాం. చిత్తశుద్ధితో అమలుచేస్తాం. బలహీనవర్గాల్లోని అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలలు, రెసిడెన్షియల్ విద్యపై ప్రత్యేకదృష్టి పెట్టాం.

# బాగా పనిచేసే ఉద్యోగులకు వెయిటేజ్

అమరావతి: బాగా పనిచేసే ఉద్యోగులను గుర్తించి వారిని ప్రోత్సహించేలా అభినందన లేఖలు పంపేలా అన్నిశాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. అలాగే ఆయా ఉద్యోగుల వ్యక్తిగత రికార్డుల్లో వాటిని నమోదు చేయాలన్నారు. పనితీరు ఆధారంగా ఉద్యోగులకు వెయిటేజ్ ఇవ్వాలని ఆదేశించారు. సరిగా పనిచేయని వారిని మోటివేట్ చేయడంపై దృష్టిపెట్టాలని సూచించారు. సీఎం సోమవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ నుంచి వివిధ శాఖల పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో బాగా పనిచేసే ఉద్యోగులను గుర్తించి, ప్రోత్సహిస్తే బాగుంటుంది అంటూ సీఎం చేసిన సూచనపై అధికారులంతా.. చాలా మంచి నిర్ణయమని పేర్కొన్నారు. ఉద్యోగులను అభినందించడం ఇదే తొలిసారి అవుతుందని అభిప్రాయపడ్డారు. ఉద్యోగుల్లో పోటీతత్వం కూడా పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, ప్రభుత్వ సేవలను సులభతరం చేయడమే లక్ష్యంగా ఉద్యోగులు, అధికారులు పనిచేయాలని పేర్కొన్నారు. ఇంకా సీఎం ఏమన్నారంటే..

- * ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మొదలుకొని అన్ని స్థాయిల్లో ఆసుపత్రుల్లో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి.
- * పారిశుద్ధ్యం విషయంలో ఎన్నిసార్లు చెప్పినా పద్ధతి మార్చుకోని ఆసుపత్రుల జాబితా సిద్ధం చేయండి.
- * అక్కడి పొరుగుసేవల ఏజెన్సీని, సంబంధిత ఆసుపత్రి ఏవోలను బాధ్యులుగా చేయాలి.
- * గతంతో పోల్చితే ఆలయాల్లో సిబ్బంది పనితీరు కొంత బాగుంది. ఇంకా మెరుగుపడాలి.
- * ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణం ఉండేలా చూసే విషయంలో ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం వహించొద్దు.
- * భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించేలా సిబ్బంది అంతా పనిచేయాలి.
- * అవినీతికి ఆస్కారం ఉండరాదు. ఏసీబీని రంగంలోకి దించే (యాక్టివేట్ చేసే) పరిస్థితి తెచ్చుకోవద్దు.
- * సరిగా పనిచేయని కారణంగా తహసీల్దార్లను పక్కన పెట్టాల్సిన దుస్థితి రాకూడదు.
- * మంచి పనితీరు కనబరిచే డిప్యూటీ కలెక్టర్లను గుర్తిస్తున్నాం.

# ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రహార్

దిల్లీ: కేంద్ర ప్రభుత్వం సోమవారం "ప్రహార్" పేరుతో దేశంలో తొలి ఉగ్రవాద నిర్మూలన విధానానికి తెరతీసింది. బహుముఖ వ్యూహాన్ని అవలంబిస్తూ ఉగ్రవాదం పట్ల ఏమాత్రం సహనం వహించరాదన్నది ఈ విధానంలోని ప్రధాన అంశం. నిఘా ఆధారంగా ఉగ్రవాద హింసను నిరోధించడం, ఉగ్రవాదులకు, వారికి ఆర్థిక సాయం చేసేవారికి, మద్దతుదారులకు నిధులు, ఆయుధాలు, ఆశ్రయం అందకుండా చేయడం ఈ పథకం ఉద్దేశమని హోంశాఖ పేర్కొంది. దేశ విదేశాల నుంచి ఎదురవుతున్న ఉగ్రవాద ముప్పును నిర్మూలించేందుకు ఈ విధానానికి ఏడు స్తంభాల్లాంటి అంశాలను నిర్దేశించారు. ఉగ్రవాద నిరోధం, సత్వర స్పందన, అంతర్గత సామర్థ్యాల వినియోగం, మానవహక్కులు, చట్టపాలన ఆధారిత పద్ధతుల అనుసరణ, ఉగ్రవాదానికి దారితీస్తున్న మత ఛాందస భావనల కట్టడి, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న ప్రయత్నాలతో జతకలవడం అనే ఈ అంశాలు ప్రహార్‌కు పునాది వంటివని స్పష్టం చేసింది. భారత్ పొరుగున తరచూ అస్థిర పరిస్థితులు నెలకొంటున్న కారణంగా ఆయా ప్రాంతాల్లో అరాచక పరిస్థితులు తలెత్తుతున్నాయి. మన ప్రాంతంలోని కొన్ని దేశాలు ఉగ్రవాదాన్ని తమ ప్రభుత్వ విధానంగా ఎంచుకున్నాయని హోంశాఖ తన విధాన పత్రంలో పాకిస్థాన్‌ను పరోక్షంగా ప్రస్తావించింది. "భారత్ ఉగ్రవాదాన్ని ఏ మతానికీ, జాతీయతకూ, నాగరికతకూ ముడిపెట్టదు. ఉగ్రవాదం ప్రకటిత, అప్రకటిత లక్ష్యాలు ఏవైనా భారత్ ఎల్లవేళలా దాన్ని నిర్ద్వంద్వంగా ఖండిస్తూనే ఉంది" అని హోంశాఖ విధాన పత్రం పేర్కొంది. కొన్ని వర్గాల్లో నెలకొన్న దారిద్ర్యం, నిరుద్యోగం వంటి సమస్యల్ని ప్రతికూల శక్తులు తమకు అనుకూలంగా ఉపయోగించుకోకుండా నిరోధించేందుకు భారత ప్రభుత్వం ఆయా సమస్యల పరిష్కారానికి అనేక పథకాలు ప్రవేశపెట్టిందని పేర్కొంది.

# అట్టుడికిన మెక్సికో

మెక్సికో: ఉత్తర అమెరికా దేశం మెక్సికోలో తీవ్రస్థాయి హింస చెలరేగింది. ఆ దేశంతో పాటు అమెరికాకూ మోస్ట్ వాంటెడ్ క్రిమినల్‌గా ఉన్న డ్రగ్స్ ముఠా నాయకుడు నెమెసియో ఒసెగువెరా సెర్వంటెస్ ఎలియాస్ ఎల్ మెంచో ఆదివారం హతమయ్యాడు. అనంతరం మెక్సికోవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో అతడి అనుచరులు దాడులకు దిగి.. 25 మంది నేషనల్ గార్డ్ సభ్యులను హత్య చేశారు. 59 ఏళ్ల ఎల్ మెంచోను అదుపులోకి తీసుకునేందుకు అతడి స్వరాష్ట్రమైన హలిస్కోలోని తపాల్పాలో మెక్సికో సైన్యం ఆదివారం భారీ ఆపరేషన్‌ను చేపట్టింది. ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి సోదాలు నిర్వహించింది. ఎల్ మెంచో అనుచరులు కాల్పులకు దిగడంతో.. సైన్యం ఎదురుకాల్పులు జరిపింది. ఈ ఆపరేషన్‌లో దాదాపు 62 మంది డ్రగ్స్ ముఠా సభ్యులు హతమైనట్లు తెలుస్తోంది. కాల్పుల్లో గాయపడ్డ ఎల్ మెంచోను గగన మార్గంలో మెక్సికో సిటీకి తరలించేందుకు సైన్యం ప్రయత్నించింది. అయితే అక్కడికి చేరుకునేలోపే అతడు మరణించాడు. ఎల్ మెంచో లక్ష్యంగా మెక్సికో సైన్యం చేపట్టిన ఆపరేషన్‌కు తాము నిఘా సహకారం అందించినట్లు అమెరికా ధ్రువీకరించింది.

# సజావుగా ఇంటర్మీడియట్ పరీక్షలు

20,123 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. తొలిరోజు చూచిరాత కేసులు నమోదు కాలేదని, ప్రశాంతంగా పరీక్షలు జరిగాయని ఇంటర్మీడియట్ విద్యామండలి వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా పరీక్షల నిర్వహణను ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి పి.రంజిత్ బాషా కమాండ్ కంట్రోల్ రూమ్‌లోని కెమెరాల ద్వారా పర్యవేక్షించారు. మంగళగిరిలోని విజయజ్యోతి, నారాయణ జూనియర్ కళాశాలల్లో పరీక్షల నిర్వహణను స్వయంగా పరిశీలించారు. పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తంచేశారు.

# ప్రమాద బాధితురాలిని పరామర్శించిన ఎమ్మెల్యే



ప్రజాస్ఫూర్తి ప్రతినిధి: వనపర్తి జిల్లా : వనపర్తి పట్టణం పదవ వార్డు నాగవరం కు చెందిన మంగలి నాగమ్మ ఇటీవల ప్రమాదవశాత్తు జారి కింద పడడంతో కుడి చేయి విరిగిపోయింది. ఈ క్రమంలో వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నాగమ్మను సోమవారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి పరామర్శించారు. మెరుగైన వైద్యాన్ని అందించాలని వైద్యులకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, మాజీ కౌన్సిలర్ చీర్ల సత్యం సాగర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# లబ్ధిదారుల ఇంటి వద్దకే సిఎంఆర్ ఎఫ్ చెక్కుల పంపిణీ



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: మేము పాలకులం కాదు, ప్రజల సేవకులం అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఏళ్ల బాల్ రెడ్డి అన్నారు. ప్రజా పాలనలో భాగంగా ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్ ఎఫ్) ద్వారా ముస్తాబాద్ మండలంలోని లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను ఆయన లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి స్వయంగా సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తూనే, సిఎంఆర్ ఎఫ్ ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు కోట్లాది రూపాయల సాయాన్ని పేదలకు అందించామన్నారు. తమ ఇంటికే వచ్చి చెక్కులు ఇవ్వడంపై లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ విజయ్ రెడ్డి, వార్డ్ మెంబర్ రంజాన్, నరేష్, తాళ్ళపల్లి శ్రీనివాస్ గౌడ్, నాయకులు మిడిదొడ్డి భాను, మహేందర్ రెడ్డి, ఉచ్చిడి బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందిన సంఘటన ముస్తాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నామాపూర్ గ్రామానికి చెందిన బోమ్మెన చందు (21), ఆదివారం రాత్రి సుమారు 11:30 గంటల సమయంలో తన బైక్ (టిఎస్ 23 డి 5487) పై బయటకు వెళ్లాడు. గూడెం నుండి ఆవునూర్ వైపు వెళ్తుండగా, గూడెం గ్రామం దాటిన తర్వాత గుర్తుతెలియని వాహనం అతడి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చందు రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడటంతో, గమనించిన స్థానికులు వెంటనే సిద్దిపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం 1:00 గంటకు పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి తండ్రి బోమ్మెన ఎల్లం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించినట్లు ముస్తాబాద్ ఏ ఎస్ఐ అబ్దుల్ ఘనీ తెలిపారు. యువకుడి మరణంతో నామాపూర్ గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

# తృతీయ బహుమతి సాధించిన జన్నారం విద్యార్థి..



ప్రజాస్ఫూర్తి, జన్నారం : మంచిర్యాల జిల్లా జన్నారం ప్రభుత్వ జూనియర్ కళాశాల లో చదువుతున్న సి.ఈ. సీ. గ్రూప్ చెందిన ఎం.డి. ఆస్మా. కరాటే పోటీలో 16 ఇయర్స్, 47 కేజీ తో జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు ఎంపిక కావడం జరిగింది, సీఎం కప్పు రాష్ట్రస్థాయిలో హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన కరాటే పోటీలో తృతీయ బహుమతిగా 5000 రూపాయలు నగదు బహుమతి తో పాటు మోడల్ తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఎం.డి. ఆస్మా విద్యార్థిని కళాశాల ప్రిన్సిపాల్ . p. శ్రీనివాస్ , స్పోర్ట్స్ లెక్చరర్ మైస కుమారస్వామి, అధ్యాపక బృందం బాపు రావు, సాయి కుమార్, రవీందర్, నాగేశ్వర్ రావు, మోహన్, దేవందర్, శశికళ, స్వరూప, కరుణాకర్, కుమారస్వామి, శివరాం సార్ విద్యార్థి పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# శ్రీనిధా డయాగ్నోస్టిక్ సెంటర్ ప్రారంభం




మల్కాజిగిరి, ప్రజాస్ఫూర్తి : శ్రీనిధా డయాగ్నోస్టిక్ సెంటర్ ఘనంగా ప్రారంభమైంది.*కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భారతీయ జనతా పార్టీ ప్రముఖ నాయకులు విచ్చేశారు. జ్యోతి ప్రజ్వలన చేసి, రిబ్బన్ కట్ చేసి ఈ కేంద్రాన్ని ప్రారంభించారు.శ్రీనిధా మాట్లాడుతూ సామాన్యులకు అందుబాటు ధరలో, నాణ్యమైన పరీక్షలు అందిస్తున్నామని లేటెస్ట్ టెక్నాలజీతో కూడిన ల్యాబ్ పరికరాలు మా ప్రత్యేకత అని రోగులకు ఇంటికి వెళ్ళి శాంపిల్స్ సేకరించడం జరుగుతుందని తెలిపారు.. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు , కార్యకర్తలు, శ్రీనిధా డయాగ్నోస్టిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# వైభవంగా బీరప్ప -కామరాతి కళ్యాణం..

*** పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు**

అందోలు, ప్రజాస్ఫూర్తి : అందోలు మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి గ్రామంలో బీరప్ప జాతర మహోత్సవాలు ఆరు రోజులుగా ఘనంగా సాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా సోమవారం బీరప్ప కామరాతి కళ్యాణ వేడుకను నిర్వహించారు. ఒగ్గుకళాకారులు బీరప్ప ఆలయ ఆవరణలో పెద్దపట్నం వేసి సాంప్రదాయ బద్ధంగా లింగాలకు పూజలు చేస్తూ డప్పు చప్పుల్లు, బోలు వాయిద్యాల మద్య బీరప్ప- కళ్యాణం అంగరంగ వైభవంగా జరిపించారు. గొల్లకురుమలు ఇంటిల్లి పాదిగా మరియు కుల బంధువులతో పాటు గ్రామస్తులు, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కళ్యాణాన్ని తిలకించి ఆలయంలో దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకిరించారు. కళ్యాణ వేడుక సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసి పోవడంతో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. జాతర సందర్భంగా స్వీట్ల దుకాణాలు, ఆటవస్తువుల దుకాణాలు ఇతర వ్యాపార దుకాణాలు పెద్ద ఎత్తున వెలిశాయి. చిన్నారులు, యువకులు ఉత్సాహంగా



జాతర ఉత్సవాలలో పాల్గొని కేరింతలు కొడుతూ చిందులు వేశారు. కళ్యాణ వేడుక సందర్భంగా ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయగా భక్తులందరూ అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏయంసీ మాజీ డైరెక్టర్ శేరి వెంకట్‌రెడ్డి, వార్డు సభ్యులు తెనుగు మహిపాల్, కాంగ్రేస్ గ్రామ పార్టీ అద్యక్షుడు వీరేశం, ఆర్.నర్సింలు తోపాటు తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# సంత్ సేవాలాల్ ను ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలి

*** కలెక్టర్ బి చంద్రశేఖర్**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : నీతి, నిజాయితీ, ధర్మం వంటి సత్యమార్గాలు బోధించిన సంత్ సేవాలాల్ మహారాజ్ ను ఆదర్శంగా తీసుకుని సమాజం ముందుకెళ్లాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. సంత్ సేవలాల్ మహరాజ్ 287 వ జయంతిని పురస్కరించుకొని సోమవారం నల్గొండ జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ చౌరస్తాలో నిర్వహించిన సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మహారాజ్ లంబాడా ,గిరజన జాతిలోని మూఢనమ్మకాలను పారద్రోలి వారి అభ్యున్నతికి కృషి చేశారన్నారు. సంత్ సేవాలాల్ మహరాజ్ స్ఫూర్తితో రూపొందించిన రాజ్యాంగం, హక్కులు ,ప్రభుత్వ పథకాలను పేద, నిమ్న వర్గాలకు అందించేందుకు ప్రభుత్వం ముందుంటుందని తెలిపారు.ఈ కార్యక్రమానికి హాజరైన మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మహారాజ్ ఆధ్యాత్మిక గురువని, సేవ, ధర్మం సమ భావనలను బోధించారని, సత్సంగ్ ద్వారా సమాజాన్ని మంచి మార్గంలో పయనించేందుకు కృషి చేశారని అన్నారు. సమావేశానికి ప్రవీణ్ నాయక్ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి చత్రు నాయక్, లంబాడ హక్కుల రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సక్రు నాయక్,ఎరుకల సంఘం అధ్యక్షులు నరసింహ, అడిషనల్ ఎస్పి రమేష్, డిప్యూటీ మేయర్ అశ్రఫ్ అలీ ,తహసిల్దార్ పరశురాం ,కార్పొరేటర్లు దీప్లా నాయక్, నాగార్జున, రవి నాయక్, ఇతర లంబాడా సంస్థల ప్రతినిధులు, తదితరులు హాజరయ్యారు ..



# సీఎం కప్ సబ్ జూనియర్ ఫుట్‌బాల్‌లో అద్భుత ప్రదర్శనతో విజేతగా నిలిచిన మేడ్చల్ జిల్లా జట్టు



ప్రజాస్ఫూర్తి , హైదరాబాద్ : గచ్చిబౌలిలో నిర్వహించిన సీఎం కప్-2025 స్టేట్ లెవెల్ సబ్ జూనియర్ ఫుట్‌బాల్ పోటీల్లో మేడ్చల్ జిల్లా జట్టు అద్భుత ప్రదర్శనతో విజేతగా నిలిచింది. ఫిబ్రవరి 20 నుంచి 23 వరకు గచ్చిబౌలి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన ఈ రాష్ట్ర స్థాయి పోటీల్లో పలు జిల్లాల జట్లు పోటీపడ్డాయి. మేడ్చల్ జిల్లా జట్టు ఆటగాళ్లు ప్రారంభం నుంచే దూకుడుగా ఆడి ప్రత్యర్థి జట్లపై ఆధిపత్యం ప్రదర్శించారు. సమన్వయం, వేగం, క్రమశిక్షణతో కూడిన ఆటతీరుతో ఫైనల్ మ్యాచ్‌లో గెలిచి ట్రోఫీని కైవసం చేసుకున్నారు. జట్టు కోచ్‌ల వ్యూహాలు, ఆటగాళ్ల పట్టుదల విజయానికి ప్రధాన కారణంగా నిలిచాయి.విజేత జట్టును అధికారులు, కోచ్‌లు, క్రీడా ప్రియులు అభినందించారు. భవిష్యత్తులో రాష్ట్రం తరఫున జాతీయ స్థాయి పోటీల్లో కూడా మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

# ప్రతి పేదకుటుంబానికి సంక్షేమ ఫలాలు అందాలి



**: ఎమ్మెల్యే కూనంనేని**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నియోజకవర్గంలో రూ.1.98 కోట్ల విలువైన సంక్షేమ చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 168 మందికి రూ.1.68 కోట్ల కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందజేశారు. అలాగే 72 మందికి రూ.30.75 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు.పేద కుటుంబాల ఆడబిడ్డలకు ప్రభుత్వం భరోసాగా నిలుస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్.కె. సాబీర్ పాషా, మూడ్ గణేష్, లలితకుమారి, పుల్లయ్య, కృష్ణప్రసాద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఇంజనీరింగ్ శాఖల పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

*** కలెక్టర్ బి. చంద్రశేఖర్**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : వివిధ ఇంజనీరింగ్ శాఖల ద్వారా చేపట్టిన పనులను ప్రాధాన్యత క్రమంలో, నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ అభివృద్ధి పనులపై ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న అంగన్వాడి కేంద్రాలు, మూత్రశాలలు, అంగన్వాడి భవనాలు, గ్రామపంచాయతీ భవనాలు, పాఠశాల ప్రహరీ గోడలు, కాంపౌండ్ గోడలు, మూత్రశాలల నిర్మాణం వంటి పనులు వేగవంతం చేయాలని తెలిపారు. చిన్నారులు మరియు విద్యార్థులకు మౌలిక సదుపాయాలు అందేలా నాణ్యతతో పనులు చేయాలని సూచించారు.అదేవిధంగా పీఎం శ్రీ పాఠశాలలు, మహాత్మ జ్యోతిరావు పూలే పాఠశాలలల్లో చేపడుతున్న మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను సమయానికి పూర్తి చేయాలని , యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఎస్ డి ఎఫ్, ఎంపీ లాడ్స్ నిధులతో చేపడుతున్న పనులు ఎక్కడైనా పెండింగ్‌లో ఉంటే వెంటనే పూర్తి చేయాలని చెప్పారు.రెవిన్యూ అదనపుకలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ నల్గొండ ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి, జిల్లా అధికారులు పంచాయతీరాజ్ ఆర్ అండ్ బి ఎలక్ట్రిసిటీ ఈడబ్ల్యుఐడీసీ తదితర ఇంజనీరింగ్ శాఖల అధికారులు,తదితరులు హాజరయ్యారు.

# ఇంటర్ పరీక్ష కేంద్రాల వద్ద 163 సెక్షన్ ను పకడ్బందీగా అమలు చేయాలి

*** జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : ఇంటర్ వార్షిక పరీక్షలు జరిగే పరీక్ష కేంద్రాల వద్ద తహసీల్దార్ లు బి యన్ ఎస్ ఎస్ 163 సెక్షన్ ను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలో ఈనెల 25 నుండి మార్చి 18 వరకు (ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు) నిర్వహించే ఇంటర్మీడియట్ పరీక్షల కోసం జిల్లాలో 45 పరీక్ష కేంద్రాలలో విద్యార్థులు రాయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల దూరంలో బీఎన్ఎస్ఎస్ 163 సెక్షన్ అమలు చేయాలని తహసిల్దారులను ఆదేశించారు.పరీక్షలు జరిగే సమయంలో పరీక్ష కేంద్రాలకు దగ్గరలో ఉన్న జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు.

# విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్స్ అందించిన గల్ఫ్ స్వచ్ఛంద సేవా ఫౌండేషన్ధర్మారం



ప్రజాస్ఫూర్తి, జన్నారం : పిల్లలు చదువుతో పాటు క్రీడలలో కూడా ముందుండాలని గల్ఫ్ స్వచ్ఛంద సేవ ఫౌండేషన్ ధర్మారం శాఖ నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు. జన్నారం మండలంలోని ధర్మారం అప్పర్ ప్రైమరీ స్కూల్ లోసోమవారం పిల్లలకు స్పోర్ట్స్ కిట్ ను అందజేశారు. అదేవిధంగా గత 48 సంవత్సరాలుగా పాఠశాలలో అటెండర్ గా సేవలు అందిస్తున్న గొల్లపల్లి నారాయణ, పిల్లలకు మంచి పౌష్టికరమైన బోజనాలు పెడుతూ సేవలందిస్తున్న మగ్గిడి లచ్చక్క, చిట్యాల విజయ లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ధర్మారం గల్ఫ్ అసోసియేషన్ వ్యవస్థాపకులు మగ్గిడి తిరుపతి మాట్లాడుతూ పిల్లలంతా మంచిగా చదువుకోవాలని, ఆటలలో క్రీడలలో కూడా ముందుండాలని,చదువు కున్న బడికి తమ వంతు సహాయాన్ని అందివ్వడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎబ్బండి సత్తన్న, గల్ఫ్ అసోసియేషన్ సభ్యులు రాచకొండ రాజేష్,నమిలకోద కాంతారావు, చిట్యాల రాజు, తడకపెల్లి వరుణ్,గల్ఫ్ అసోసియేషన్ సభ్యులు మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు గ్రామ ప్రజలు, పాఠశాల సిబ్బంది గల్ఫ్ స్వచ్ఛంద సేవ ఫౌండేషన్ ధర్మారం వారిని అభినందించారు.

# జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహణ



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఫిజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో ఆనందఖని పాఠశాలలో జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ పోటీలలో జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 120 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీలలో 9వ తరగతి చదువుతున్న కే. వరుణ్ సాయి (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జగన్నాధపురం) ప్రథమ బహుమతిని సాధించారు. ఈ విద్యార్థికి ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయిని బి. దుర్గా శైలజ మార్గనిర్దేశనం చేశారు. ద్వితీయ బహుమతిని బి. ధనుష్ (ఉన్నత పాఠశాల, ఆనందఖని), తృతీయ బహుమతిని షేక్ నజీమా (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, భద్రాచలం) సాధించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా విద్యాశాఖ అధికారి నాగలక్ష్మి మాట్లాడుతూ, నిత్య జీవితంలో సైన్స్‌ను అన్వయించుకుని జీవన విధానంలో భాగంగా మార్చుకుంటే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని పేర్కొన్నారు. పోటీలలో పాల్గొన్న విద్యార్థులందరినీ ఆమె అభినందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ ఆఫీసర్ సంపత్ కుమార్, జిల్లా విద్యాశాఖ సమన్వయకర్తలు నాగరాజ్ శేఖర్, సైదులు, సతీష్, ఫిజికల్ సైన్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు అమీరుద్దీన్, యశోద, అనురాధ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ ని కలిసిన నాగసానిపల్లి సర్పంచ్

* గ్రామ అభివృద్ధికి సహకరించాలని వినతి



ప్రజాస్ఫూర్తి, శ్రీరంగాపూర్ (వనపర్తి జిల్లా) : మండల పరిధిలోని నాగసానిపల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ సుజాత రాజశేఖర్ వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం కలెక్టర్ ఆదర్శ్ సురభి ని చాంబర్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుజాత మాట్లాడుతూ గ్రామంలోని పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని, నాగసానిపల్లి గ్రామ అభివృద్ధికి సహకరించాలని కలెక్టర్ ని కోరడం జరిగిందన్నారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ గ్రామ అభివృద్ధికి సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ భరత్ కుమార్ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు బీరం రాజశేఖర్ రెడ్డి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన లయన్స్ సభ్యులకు సన్మానం..

అందోలు, ప్రజాస్ఫూర్తి :జోగిపేట లయన్స్ క్లబ్ సభ్యులు ఇటీవల ప్రజా ప్రతినిధులుగా ఎన్నిక కావడం పట్ల ఆదివారం రాత్రి స్థానిక లయన్స్ భవన్ లో వారిని ఘనంగా సత్కరించారు. అందోల్ జోగిపేట మున్సిపల్ చైర్మన్ గా ఎస్. కృష్ణారెడ్డి, కౌన్సిలర్లుగా పట్లూరి శివ శేఖర్, తోట్ల రామకృష్ణ, పట్లోళ్ల రేఖ ప్రవీణ్, పల్లె మంజుల శ్రీకాంత్, రాచకొండ జ్యోతి ప్రదీప్ గౌడ్, అక్సాని పల్లి సర్పంచ్ మధుమతి హరి నారాయణ వర్మ లు ఇటీవల జరిగిన స్థానిక సంస్థ ఎన్నికల్లో గెలుపొందడంతో లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ డాక్టర్ ఎస్. రవీందర్ గౌడ్, డిస్టిక్ పిఆర్ఓ డాక్టర్ కే. అనంత రెడ్డి, సీనియర్ క్లబ్ సభ్యులు ఎస్.



జగన్ మోహన్ రెడ్డి లు శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్బు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి. రవి శేఖర్ రెడ్డి, జీ. సంతోష్, కోశాధికారి ఎం. మల్లేశం, క్లబ్ సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్. రవీందర్ గౌడ్ మాట్లాడుతూ లయన్స్ సభ్యులు రాబోవు రోజుల్లో అందోలు నియోజకవర్గం నుంచి శాసనసభ్యులుగా పోటీ చేసి గెలవాల్సిన అవసరం ఉందన్నారు. రాబోవు రోజుల్లో రిజర్వేషన్లు మారనున్న సందర్భంగా సభ్యులు ఇప్పటినుంచే తమ పనుల్లో నిమగ్నం కావాలని ఆయన సూచించారు. ప్రజల్లో లయన్స్ క్లబ్లో సభ్యులకు మంచి పేరు ఉందని ఆయన అన్నారు.

# డెస్క్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ లు పెంచాలి

* ఖమ్మం కలెక్టర్ కు వినతి



ప్రజాస్ఫూర్తి/ఖమ్మం జిల్లా : డెస్క్ జర్నలిస్టులకు గతంలో మాదిరి అందరికీ అక్రిడిటేషన్లు ఇవ్వాలని టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ ఖదీర్,కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, డెస్క్ జర్నలిస్టుల ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ (డీజేఎఫ్ టీ) ఖమ్మం జిల్లా అడ్ హక్ కమిటీ కార్యదర్శి కేతిరెడ్డి అచ్చిరెడ్డి డిమాండ్ చేశారు. డీజేఎఫ్ టీ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం ఖమ్మం కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టులు ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురుశెట్టికి వినతి పత్రం సమర్పించారు. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా డెస్క్ జర్నలిస్టుల అక్రెడిటేషన్ల సంఖ్య భారీగా తగ్గించి అన్యాయం చేయొద్దని ఖదీర్, శ్రీనివాసరెడ్డి, అచ్చిరెడ్డి కోరారు. డెస్క్ జర్నలిస్టులు ఎడిషన్ కేంద్రాల్లోనే పనిచేసినా ఏ జిల్లాకు ఆ జిల్లా డెస్కులు వేరువేరుగా ఉంటాయని, ప్రతి జిల్లాకు ఒక ఇన్చార్జితో పాటు నలుగురికి పైగా సబ్ ఎడిటర్లు ఉంటారని చెప్పారు. ఒక్కో ఎడిషన్లో మూడు నుంచి ఆరు జిల్లాలున్నాయని వాటికి అనుగుణంగా అక్రిడిటేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీవో ప్రకారం ఎడిషన్ కు నాలుగు కార్డులే ఇస్తే కనీసం ఆ జిల్లాల ఇన్చార్జిలకు కూడా అక్రెడిటేషన్లు వచ్చే పరిస్థితి లేదన్నారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కోశాధికారి తేనె వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు దువ్వా సాగర్, సహాయ కార్యదర్శి కూరాకుల గోపి, టీబీజేఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఫయాజ్, గణేష్, టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం నియోజకవర్గం అధ్యక్ష, కార్యదర్శులు తురగ రాఘవేంద్ర మూర్తి, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, స్టేట్ కౌన్సిల్ మెంబర్ ఎన్. మధుశ్రీ, జానీపాష,డీజేఎఫ్ టీ నాయకులు వీసారపు అంజయ్య,బంకా వెంకటేశ్వర్లు,ఉపేంద్ర, ప్రసాద్,టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా నాయకులు చింతకాని ప్రసాద్, అర్షద్,గోపీ,షకీల్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



# మేడ్చల్ మల్కాజిగిరి కాప్రా ప్రెస్ క్లబ్ (ఎలక్ట్రానిక్ మీడియా) నూతన కమిటీ ఏర్పాటు

* జర్నలిస్టుల సంక్షమానికి కృషి చేస్తా...నూతన అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి

కాప్రా, ప్రజాస్ఫూర్తి : కాప్రా ప్రెస్ క్లబ్ (ఎలక్ట్రానిక్ మీడియా) నూతన కమిటీ సోమవారం టి, ఎస్,ఐ,ఐ, సి కాలనిలో కాప్రా ప్రెస్ క్లబ్ లో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా రొండ్ల ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గాదె రాము గుప్తా, కోశాధికారిగా నమ్ముల రమేష్ యాదవ్,సంయుక్త కార్యదర్శులుగా అమరేందర్,సత్యం, ఉపాధ్యక్షులుగా ప్రశాంత్, బసంత్ రెడ్డి, కార్య నిర్వాహక అధ్యక్షులుగా నటరాజ్,దాచారం రమేష్,గౌరవ అధ్యక్షులుగా రామారం సుధీర్ గౌడ్,గుండ్ల గోపాల్ గౌడ్, ప్రధాన సలహాదారులుగా శనిగరం అశోక్ , నరసింహ రెడ్డి లు, కార్యనిర్వాహక సభ్యులుగా మసైయ్య గౌడ్, రమేష్ గౌడ్, ప్రసాద్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు, ఈ సందర్భంగా అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ నాకు అప్పగించిన బాధ్యతలతో పాటు ప్రతీ జర్నలిస్టులకు ఎలాంటి వడిదుడులు ఎదురైనా నేను ముందు ఉండి పోరాటం కొనసాగిస్తానని తెలిపారు. అంతే కాకుండా కాప్రా ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులకు అన్నివేళలా అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.

# ముస్తాబాద్‌లో చిరుజల్లుల వర్షం

* విద్యార్థులు వాహనదారుల ఇబ్బందులు

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాల్లో సోమవారం మధ్యాహ్నం సుమారు మూడు గంటల ప్రాంతంలో చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. ఒక్కసారిగా ఆకాశంలో దట్టమైన మేఘాలు అలుముకోవడంతో వాతావరణం పూర్తిగా మారిపోయింది. అకస్మాత్తుగా కురిసిన ఈ వర్షం వల్ల ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న ప్రయాణికులు, వాహన చోదకులు అంతరాయానికి గురయ్యారు. తుఫాన్ ప్రభావంతో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ఇదివరకే వెల్లడించిన నేపథ్యంలో, ఈ



మార్పు చోటుచేసుకుంది. ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఉపశమనం పొందినప్పటికీ, ప్రయాణికులకు మాత్రం కొంత ఇబ్బంది తప్పలేదు. ముస్తాబాద్ నుంచి దుబ్బాక వెళ్లే మార్గంలో జడ్పిహెచఎస్ పాఠశాల ఉండగా ఈ మార్గంలో చిన్నపాటి వర్షానికే రోడ్డుపై నీరు నిలుస్తుంది. విద్యార్థులు, వాహనదారులు దీంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అటుగా వాహనాలు వెళ్లినప్పుడు రోడ్డుపై ఉన్న నీరు విద్యార్థులపై పడుతుంది. గత కొంత కాలంగా ఈ సమస్యతో విద్యార్థులు, వాహనాదారులు, ప్రజలకు సమస్య ఏర్పడుతుంది. గతంలో పాలక వర్గంలో లేకపోవడంతో ఈ సమస్యను ఎవరూ పట్టించుకోలేదు. ప్రస్తుతం నూతన పంచాయతీ పాలక వర్గం ఏర్పడ్డ తరుణంతో ఈ సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు, వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

# గోదావరి పుష్కరాలపై సమగ్ర ప్రతిపాదనలు సమర్పించాలి

* ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (రెవెన్యూ, దేవాదాయ) శైలజ రామయ్యర్



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:రాష్ట్రంలో నిర్వహించనున్న గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై సమగ్ర ప్రతిపాదనలు తక్షణమే సిద్ధం చేసి సమర్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (రెవెన్యూ, దేవాదాయ) శైలజ రామయ్యర్ ఆదేశించారు. హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో గోదావరి తీర జిల్లాల అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు.పారిశుద్ధ్యం, త్రాగునీరు, వైద్య శిబిరాలు, అంబులెన్సులు, పోలీసు బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, తాత్కాలిక మరుగుదొడ్లు, విద్యుత్ వంటి మౌలిక వసతులపై పూర్తి స్థాయి ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు.ప్రత్యేకంగా భద్రాచలంలో ఏర్పాట్లపై సమగ్ర నివేదిక ఇవ్వాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పుష్కరాలను లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

# రైతులకు వెంటనే రైతు భరోసా చెల్లించాలి.. రుణమాఫీ చేయాలి

* బిజెపి కిసాన్ మోర్చా కలెక్టర్కు వినతి.




నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : రైతులకు వెంటనే రైతు భరోసా డబ్బులు వారి ఖాతాలో జమ చేయాలని రుణమాఫీ కానీ రైతులకు రుణమాఫీ చేయాలని యూరియా అందుబాటులో ఉంచాలని కోరుతూ బిజెపి కిసాన్ మోర్చా జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో కలెక్టర్కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిజెపి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకటరెడ్డి, కిసాన్ మోర్చా జాతీయ నాయకులు గోలి మధుసూదన్ రెడ్డిలు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు ఎకరానికి 15 వేల రూపాయల చొప్పున రైతు భరోసా ఇస్తామని 2 లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని 11 రకాల పంటలకు 500 రూపాయల బోనస్ ఇస్తామని శాసనసభ ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు అయినా వాటిని అమలు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్ లో రైతులకు హామీ ఇచ్చిన హామీలన్నింటిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.అలాగే యూరియాను అందుబాటులో ఉంచాలని ధాన్యం కొనుగోలుకు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేయాలని ప్రధానమంత్రి ఫసల్ బీమా ను రాష్ట్రంలో అమలు చేయాలని రైతులకు వ్యవసాయ పరికరాలు సబ్సిడీ పైన అందజేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి కిసాన్ మోర్చా నాయకులు భవనం మధుసూదన్ రెడ్డి, గూండా నవీన్ రెడ్డి,యానాల కరుణాకర్ రెడ్డి,కోమటిరెడ్డి వెంకటరెడ్డి,మిర్యాల వెంకటేశం,మండల వెంకన్న, దాసోజుయాదగిరి చారి,మాల వెంకటరెడ్డి,వెన్నమల్ల మహేష్, కొప్పు సోమయ్య, పూతపాక లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులన్నిటిని పరిష్కరించాలి

* కలెక్టర్ బి చంద్రశేఖర్



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు .ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా సోమవారం ఆయన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు .అనంతరం అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని వేగంగా పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు.పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి ఫిర్యాదులను ఆలస్యం చేయకుండా వెంటనే పరిశీలించి, నిర్దిష్ట గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సోమవారం మొత్తం 138 వ్యాధులు రాగా రెవిన్యూ శాఖకు 78 , తక్కిన 60 వివిధ శాఖలకు చెందిన ఫిర్యాదులు ఉన్నాయి. రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ఆర్డీవో వై. అశోక్ రెడ్డి, చండూరు ఆర్టీవో శ్రీదేవి, దేవరకొండ ఆర్డి ఓ. రమణారెడ్డి, జిల్లా అధికారులు ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భవనం మొత్తాన్ని పరిశీలించారు. డాక్టర్ గదులు, పేషంట్స్ వేచి ఉండే గది, ల్యాబ్, స్టోర్, వివిధ గదులు ,వార్డులు, ర్యాంప్, టాయిలెట్ సౌకర్యం, అలాగే నీటి వసతి. పరిసరాలు అన్నింటిని పరిశీలించారు.జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సూపరింటిండెంట్ నేతనరసింహారావు ,మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

* జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం, ప్రజాస్ఫూర్తి : ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్,అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి.శ్రీజ,పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు. వేంసూరు మండలం మర్లపాడు గ్రామానికి చెందిన భీమిరెడ్డి పుల్లారెడ్డి భరణిపాడు నుంచి పర్వతాపురం ఆర్ అండ్ బీ రోడ్డు గుంతలతో అధ్వాన్నంగా ఉందని, భరణిపాడు కాలువ మీద ఉన్న వంతెన శిథిలావస్థలో ఉందని, వీటికి అవసరమైన మరమ్మత్తు పనులు వెంటనే చేపట్టాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా,ఈఈ ఆర్ అండ్ బీ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ఖమ్మం నగరం ఖానాపురం హవేలికి చెందిన ఎన్.నటరాజ్ తాను దివ్యాంగుడినని తనకు సొంత ఇల్లు లేనందున ఇందిరమ్మ



ఇంటిని మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఈఈ హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.నేలకొండపల్లి మండలం అప్పల నర్సింహపురం గ్రామస్తులు తమ గ్రామంలో సెల్ఫోన్ సిగ్నల్ లేకపోవడం వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, గ్రామ ప్రజల ఇబ్బందుల దృష్ట్యా జియో టవర్ నిర్మించుటకు అనుమతించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా,కలెక్టరేట్ డి విభాగం పర్యవేక్షకులకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. వైరా మున్సిపాలిటీ 14వ వార్డుకు చెందిన ఎస్సీ కాలనీ వాసులు నిరుపయోగంగా ఉన్న ఎన్.ఎస్.పి.కెనాల్ స్థలంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, వైరా మున్సిపల్ కమీషనర్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.ప్రజావాణి కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ దీక్షా రైనా,జిల్లా అధికారులు,కలెక్టరేట్ సూపరింటెండెంట్ లు, తదితరులు పాల్గొన్నారు..

# వర్షపు నీటి కాలువ నిర్మాణ పనులను నాణ్యత పాటించాలి

* మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్



శేరిలింగంపల్లి, ప్రజాస్ఫూర్తి : వర్షపు నీటి కాలువ నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు వినియోగంలోకి తీసుకురావాలని ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. శంషిగూడ డివిజన్ పరిధిలోని మహంకాళి నగర్ ఆశా నగర్ హైటెన్షన్ లైన్ రోడ్డు లోని నూతనంగా నిర్మిస్తున్న వర్షపు నీటి కాలువ (బాక్స్ డ్రైన్) నిర్మాణ పనులు తాత్కాలికంగా నిలిపివేసారని కాలనీ ప్రజలు డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకురాగా వారు సమస్యను స్వయంగా పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి వరద నీటి కాలువ నిర్మాణ పనుల పురోగతి గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్ అధికారుల అనుమతుల కోసం పనులకు తాత్కాలికంగా అంతరాయం ఏర్పడిందని, టౌన్ ప్లానింగ్ శాఖ అధికారులతో మాట్లాడడం జరిగిందన్నారు. వారు కూడా సానుకూలంగా స్పందించారని , త్వరలో వరద నీటి కాలువ నిర్మాణ పనులు పునఃప్రారంభిస్తారని వెంకటేష్ గౌడ్ కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోశెట్టిగౌడ్, అగ్రవాసు, సత్యనారాయణ, మహేష్, పుల్లారావు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జగినీ టెక్స్టైల్స్ 69 వ వార్షికోత్సవము

* పాల్గొన్న కలెక్టర్ మేయర్

నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : నల్లగొండ పట్టణంలోని ప్రకాశం బజార్ లో ఉన్న జగినీ టెక్స్టైల్స్ 69వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ మేయర్ గురుచైతన్య శ్రీనివాసరెడ్డి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జెమినీ టెక్స్టైల్స్ ప్రొప్రైటర్ జెమిని వెంకన్న మాట్లాడుతూ మా కస్టమర్స్ కు స్నేహితులకు,జిల్లా ప్రజలకు జగిని టెక్స్టైల్స్ 69 వ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.మా సంస్థ 1957న స్థాపించారు ఇప్పటికి 69 సంవత్సరాలు గడిచినవి.మా సంస్థ ద్వారా ప్రతీ వేసవిలో చలివేంద్రాలు ఏర్పాటు మట్టి గణపతి విగ్రహాల పంపిణి



మా సంస్థ ద్వారా మరెన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.వార్షికోత్సవ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ మేయర్ గురు చైతన్య శ్రీనివాస్ రెడ్డిని,డిప్యూటీ మేయర్ అమీర్,మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,మధుసూదన్ రెడ్డి,గుమ్ముల మోహన్ రెడ్డి, కార్పొరేటర్ హాజి, ఆర్డీవో అశోక్ రెడ్డి, ఈ ఈ వెంకటేశ్వర్లు, రమేష్ డి.ఎస్.పి శివరాం రెడ్డి, సిఐలు ఆదిరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, ఎస్సై సైదా బెటాలియన్ కమండెట్ వీరయ్య, డి.ఎస్.పి వెంకన్న,డాక్టర్స్ పుల్లారావు,మూర్తి తదితరులను సన్మానించి గౌరవించారు.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



రంగారెడ్డి , ప్రజాస్ఫూర్తి : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రంగారెడ్డి జిల్లాలోని మహిళా ఉద్యోగులకు మార్చి నెల 4 వ తేదీన హెల్త్ క్యాంప్ ని ఏర్పాటు చేయాలని, అదేవిధంగా ఆటలు, క్రీడలు , సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడానికి మహిళలకు ప్రత్యేక అనుమతి ఇప్పించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ను డిఆర్ఓ ద్వారా వినతి పత్రాన్ని సమర్పించారని రంగారెడ్డి జిల్లా టిజీఓ అధ్యక్షులు డాక్టర్ కే రామారావు తెలిపారు. మార్చి 7వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకోవడానికి అనుమతినివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో శాంతి శ్రీ, రేవతి, అలివేలు, మహేశ్వరి, సైదమ్మ, జోత్స్న బాలేశ్వరి, డా.నరేందర్, మసూద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# మల్కాజిగిరి అభివృద్ధి కోసం మున్సిపల్ కమిషనర్ తో భేటీ ఎమ్మెల్యే



మల్కాజిగిరి, ప్రజాస్ఫూర్తి : మల్కాజిగిరి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం మున్సిపల్ కమిషనర్‌తో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి భేటీ అయ్యారు. మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి, మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు , పలు కాలనీల సంక్షేమ సంఘాల నాయకులతో కలిసి నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న తక్షణం చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే స్పష్టమైన సూచనలు చేశారు. అదనపు ఏవో సి రోడ్ల నిర్మాణం సిఆర్ఎంపి కింద రోడ్ల నిర్మాణం మచ్చ బొల్లారం డివిజన్‌లోని ఏడు కాలనీలకు సంబంధించిన ట్రంక్ మెయిన్ నిర్మాణం చెరువుల ఆధునికరణ, పరిరక్షణ చర్యలు ఆర్కే పురం ఫ్లైఓవర్ నిర్మాణానికి రీఅలైన్‌మెంట్ చేసి పల్లవి విల్లా అపార్ట్‌మెంట్ వాసులకు మేలు కలిగే విధంగా చర్యలు తీసుకోవాలని సూచన డిఫెన్స్ భూమిలో నివసిస్తున్న 16 మంది పేద కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు అసంపూర్ణంగా ఉన్న కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం పూర్తి చేయడం మచ్చ బొల్లారం డివిజన్‌లోని హిందూ స్మశాన వాటికను పరిరక్షించి, అక్కడ ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్‌ను తక్షణం తరలించడం హిందూ, ముస్లిం స్మశాన వాటికలలో మౌలిక వసతులు కల్పించడం మరియు పరిరక్షణ చర్యలు పారిశుధ్య కార్మికులను జనాభా ప్రాతిపదికన నియమించడం సీసీ రోడ్లు, బాక్స్ డ్రైన్లు, పార్కులు వంటి అభివృద్ధి పనులకు తక్షణ మంజూరు చేయాలి జీహెచ్ఎంసీ లిమిటేషన్ మార్పుల నేపథ్యంలో ప్రజల సౌలభ్యం కోసం సర్కిల్ కార్యాలయాల్లో డివిజన్ సరిహద్దుల సవరణ ఎమ్మెల్యే మల్కాజిగిరి నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి పరచడం తన ప్రధాన లక్ష్యమని, ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులతో సమన్వయం చేస్తూ ముందుకు సాగుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి, సబితా అనిల్ కిషోర్ గౌడ్, మేకల సునీత రాము యాదవ్,జగదీష్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు అనిల్ కిషోర్ గౌడ్, అమీనుద్దీన్, డోలి రమేష్, లక్ష్మణ్ యాదవ్, ఉస్మాన్, గౌస్ ఇమ్రాన్, శ్రీధర్ గౌడ్, ఇబ్రహీం, హేమంత్ పటేల్, మారుతి ప్రసాద్, పవన్, ప్రశాంత్ రెడ్డి, జె.కే. సాయి కృష్ణ గౌడ్, బంటి, జనార్ధన్, అరవింద్, రాజేష్ గౌడ్, వెంకటేష్ తదితరులు, అలాగే సంబంధిత కాలనీల సంక్షేమ సంఘాల అధ్యక్షులు,కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# 1 9 పతకాలతో భద్రాద్రి పోలీసుల విజృంభణ

* 6 బంగారు, 6 రజత, 7 కాంస్య పతకాలు కైవసం
* అభినందించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: సైబరాబాద్ కమిషనరేట్ లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర 4వ పోలీస్ స్పోర్ట్స్ మీట్ లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసు సిబ్బంది సత్తా చాటారు. వివిధ క్రీడా విభాగాల్లో మొత్తం 19 పతకాలు (6 బంగారు, 6 రజత, 7 కాంస్య) సాధించి జిల్లాకు కీర్తి తెచ్చారు.విజేతలను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అభినందించారు. క్రీడలు మానసిక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని, జాతీయ స్థాయిలోనూ మెరుగైన ప్రదర్శన కనబరచాలని ఆకాంక్షించారు.టేబుల్ టెన్నిస్ ఓపెన్ సింగిల్స్‌లో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ రజత పతకం సాధించగా, 45 సంవత్సరాల పైబడి బ్యాడ్మింటన్ డబుల్స్‌లో ఏఆర్ డిఎస్పీ సత్యనారాయణ రజతం దక్కించుకున్నారు. ఎస్బీ ఇన్స్పెక్టర్ ఇ.శ్రీనివాస్ నాయక్ బ్యాడ్మింటన్ డబుల్స్‌లో కాంస్యం సాధించారు.పాల్వంచ సీఐ కే.సతీష్ టెన్నిస్ టీం విభాగంలో, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు టెన్నిస్ డబుల్స్‌లో రజత పతకాలు సాధించారు.కొత్తగూడెం 3టౌన్‌కు చెందిన కానిస్టేబుల్ బి.రత్నకుమారి నాలుగు పతకాలతో మెరిశారు. మహిళల బాక్సింగ్, ట్రెడిషనల్ యోగా విభాగాల్లో బంగారు పతకాలు, జిమ్నాస్టిక్స్‌లో రజతం, కళాత్మక యోగాలో కాంస్యం దక్కించుకున్నారు.ఏఆర్ కానిస్టేబుల్ ప్రవీణ్ బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో బంగారం, మిక్స్డ్ డబుల్స్‌లో రజతం సాధించారు. మహిళా కానిస్టేబుల్ డి.సుష్మ 100, 200 మీటర్ల పరుగుపందెంలో రెండు బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు.చంద్రుగొండకు చెందిన బి.రజని ఖోఖో, రిథమిక్ యోగాలో రెండు కాంస్యాలు సాధించగా, ఏఆర్ కానిస్టేబుల్ వి.వంశీ 100, 200 మీటర్ల పరుగుల్లో రెండు కాంస్యాలు సాధించారు. అశ్వాపురం మహిళా కానిస్టేబుల్ నాగస్వరూప బ్యాడ్మింటన్ మిక్స్డ్ డబుల్స్‌లో బంగారం, వుమెన్స్ డబుల్స్‌లో కాంస్యం దక్కించుకున్నారు.జిల్లా పోలీసుల విజయంతో జిల్లా వర్గాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.




# విద్యార్థుల తాగునీటి సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరిస్తా

**: కౌన్సిలర్ నరేందర్ రెడ్డి**

జిన్నారం(గుమ్మడిదల), ప్రజాస్ఫూర్తి :తాను చదువుకున్న పాఠశాలలోనే అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి యువ నాయకత్వానికి నిదర్శనంగా నిలిచారు 13వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ మూడు చింతల నరేందర్ రెడ్డి. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న ఆయన వెంటనే స్పందించారు. పాఠశాలలో ఉన్న పాత వాటర్ డ్రమ్ము పూర్తిగా పగిలిపోయి నీరు వృథాగా పోతుండగా, ఈ సమస్యపై గత పాలకులు పట్టించుకోలేదని స్థానికులు పేర్కొన్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నరేందర్ రెడ్డి తన సొంత నిధులతో కొత్త వాటర్ డ్రమ్మును కొనుగోలు చేసి, పైప్ లైన్ ఫిట్టింగ్‌తో సహా పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయించారు. దీంతో విద్యార్థుల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. పాఠశాలలో చదువుకున్న తనకు ఈ విద్యాసంస్థపై ప్రత్యేక అనుబంధం ఉందని, చిన్నారుల కోసం ఏ సహాయం చేయడానికైనా సిద్ధంగా ఉంటానని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తు కోసం అవసరమైన మౌలిక వసతులు కల్పించడం ప్రజాప్రతినిధుల బాధ్యత. చిన్న సమస్యైనా వెంటనే పరిష్కరించడమే మా కాంగ్రెస్ పార్టీ విధానం. నిర్లక్ష్య పాలనతో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తాం” అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాజు, ఆనంద్ కుమార్, నాగరాజ్, నాయకులు తులసి దాస్, యాదగిరి, పడమటి వెంకటరెడ్డి, మద్దటి మల్లేష్, శ్రీనివాసరెడ్డి, సంతోష్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రాహుల్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ముగిసిన రాష్ట్ర స్థాయి బాల్ బ్యాట్మెంటన్ పోటీలు




ప్రజాస్ఫూర్తి/ఖమ్మం : సీఎం కప్ రెండో ఎడిషన్ లో భాగంగా ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియం లో రాష్ట్రస్థాయి బాల్ బ్యాట్మెంటన్ పోటీలు ఘనంగా ముగిసాయి. తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఆర్చరీ, బాల్ బాడ్మింటన్ పోటీలు నిర్వహించడం జరిగింది.5 రోజులపాటు జరిగిన ఈ యొక్క పోటీల్లో రాష్ట్రములో 33 జిల్లాల నుండి సుమారు 800 మంది క్రీడాకారులు 200 మంది కోచ్ లు, మేనేజర్ లు, ఖమ్మం జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయులు,ట్రైనీ వ్యాయామ విద్య ఉపాధ్యాయులు, స్టేడియం సిబ్బంది ఈ యొక్క క్రీడల్లో పాలుపంచుకున్నారు. ఖమ్మం బాల్ బాడ్మింటన్ అసోసియేషన్ వారి సహకారంతో ఖమ్మం డివైఎస్ఓ తుంబూరు సునీల్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ యొక్క పోటీలు అట్ట హాసంగా ముగిసాయి.ఈ యొక్క పోటీలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి సుమారు 800 మంది క్రీడాకారులు,200 మంది కోచ్ లు,మేనేజర్లు పాల్గొన్నారు.ఈ యొక్క పోటీలకు క్రీడాకారులకు వసతి కల్పించినటువంటి బ్లూమింగ్ మైండ్ స్కూల్ కరస్పాండెంట్ అశోక్ రెడ్డి కి , ప్రియదర్శిని కాలేజీ కరస్పాండెంట్ కాటేపల్లి నవీన్ కి అలాగే టిఎన్జీవో ఫంక్షన్ హాల్ వారికీ,బిపిఈడి కాలేజీ వారికి ఖమ్మం జిల్లా స్పోర్ట్స్ అథారిటీ తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్ర స్థాయి బాల్ బ్యాట్మెంటన్ పోటీల్లో బాలుర విభాగంలో కామారెడ్డి మొదటి బహుమతి,రంగారెడ్డి రెండో బహుమతి, మూడో బహుమతి కొమర భీమ్ ఆసిఫాబాద్,నాలుగవ బహుమతి సంగారెడ్డి, బాలికల విభాగంలో మొదటి బహుమతి మెదక్,రెండో బహుమతి ఖమ్మం, మూడో బహుమతి నిజామాబాద్, నాలుగవ బహుమతి నల్గొండ విజేతలుగా నిలిచాయి. డబుల్స్ బాలుర విభాగంలో కొమరం భీమ్ ఆసిఫాబాద్ మొదటి బహుమతి, సంగారెడ్డి రెండో బహుమతి,మూడో బహుమతి నల్గొండ, నాలుగో బహుమతి రంగారెడ్డి,బాలికల డబుల్స్ విభాగంలో మొదటి బహుమతి మెదక్,రెండో బహుమతి వరంగల్, మూడో బహుమతి ఖమ్మం,నాలుగో బహుమతి కొమరం భీమ్ ఆసిఫాబాద్ విజేతలుగా నిలిచాయి.బహుమతి ప్రధాన కార్యక్రమంలో ఖమ్మం జిల్లా బాల్ బ్యాట్మెంటన్ అసోసియేషన్ అధక్షులు వేజళ్ల సురేష్, కార్యదర్శి బొంతు శ్రీనివాసరావ్,సీనియర్ క్రీడాకారుడు ఎన్వి రమణ, స్కూల్ గేమ్ కార్యదర్శి వై రామారావు,క్రిస్టఫర్ బాబు,చీఫ్ రిఫరీ రామకృష్ణ,వ్యాయామ విద్య ఉపాధ్యాయులు, డివైఎస్ ఓ సిబ్బంది, ట్రైనీ వ్యాయామ విద్య ఉపాధ్యాయులు, మెడికల్ సిబ్బంది,మున్సిపల్ సిబ్బంది,వివిధ జిల్లాలనుంచి వచ్చినటువంటి కోచ్లు మేనేజర్లు,గ్రౌండ్ సిబ్బంది ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.

# ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు మరింత శ్రద్ధ కనబరచాలి

* **స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.శ్రీనివాస్**



రంగారెడ్డి, ప్రజాస్ఫూర్తి : జిల్లా ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు మరింత శ్రద్ధ కనబరచాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.శ్రీనివాస్ అన్నారు.సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (43) ఫిర్యాదులు అందాయి. ప్రజల నుండి వివిధ అంశాలకు సంబంధించిన ఫిర్యాదుల వినతి పత్రాలు జిల్లా రెవెన్యూ అధికారి సంగీతతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమము కేవలం సమస్యలు విని దరఖాస్తులు స్వీకరించే విధంగా కాకుండా, పరిష్కారాల వేదికగా నిలిచేలా ప్రతి ఒక్కరు పని చేయాలన్నారు. ఫిర్యాదులు స్వీకరించిన వెంటనే పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమాన్ని సమస్యలు పరిష్కరించే వేదికగా మార్చాలని తెలిపారు. ఫిర్యాదులు సమర్పించడానికి వచ్చిన ప్రజలకు అవసరమైన సూచనలు, సహాయం అందించడంలో అధికారులు సిబ్బంది చొరవ చూపాలని అన్నారు. రెవెన్యూ శాఖ - 22, ఇతర శాఖలు - 21, మొత్తం 43 దరఖస్తులు అందాయి. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నూతన భవన నిర్మాణాన్ని 15 రోజుల్లో పూర్తి చేయాలి

* **కలెక్టర్ బి చంద్రశేఖర్**

నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : నల్గొండ జిల్లా కేంద్రంలోని మాన్యం చల్క పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవన నిర్మాణ పనులను 15 రోజుల్లో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.సోమవారం అయన నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డితో కలిసి జైలు సమీపంలో నిర్మాణంలో ఉన్న మాన్యం చెల్క పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను తనిఖీ చేశారు.మొదటిసారిగా ఈ భవనాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ భవనం నిర్మిస్తున్న స్థలం ,అంచనా వ్యయం ,తదితర వివరాలను వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. భవనాన్ని పూర్తి చేసేందుకు మరికొంత బడ్జెట్ అవసరం ఉందని డి ఎం హెచ్ ఓ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఇప్పటివరకు నిర్వహిస్తున్న పట్టణ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలోని పరికరాలను ఇక్కడ వినియోగించడం జరుగుతుందని, అయితే భవన నిర్మాణానికి మరికొంత బడ్జెట్ అవసరం ఉన్న విషయాన్ని మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి ,మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి సైతం జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు .అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ 15 రోజుల్లో మాన్యం చెల్క పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవన నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు .

## విద్యార్థులకు సోషల్ మీడియా నిషేధం?

# ఏపీ సర్కార్ కీలక అడుగులు!

ఆంధ్రప్రదేశ్‌లో సోషల్ మీడియా వినియోగంపై కఠిన నిబంధనలు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ముఖ్యంగా పాఠశాల విద్యార్థులను సోషల్ మీడియాకు దూరం పెట్టేలా ఒక ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని యోచిస్తున్నట్లు రాష్ట్ర హోంమంత్రి అనిత తెలిపారు. సోమవారం నాడు, సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారంపై శాసనసభలో జరిగిన చర్చలో ఆమె ఈ కీలక విషయాన్ని వెల్లడించారు. సోషల్ మీడియాను నియంత్రించడం, అసత్య ప్రచారానికి అడ్డుకట్ట వేయడం కోసం తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే ఒక కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసిందని మంత్రి అనిత వివరించారు. ఈ కమిటీ ఇప్పటికే రెండుసార్లు సమావేశమైందని, పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించిందని తెలిపారు. తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలను కమిటీ సమీక్షించిందని, రాష్ట్రంలో సమర్థవంతంగా పనిచేసే చర్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించిందని పేర్కొన్నారు. విద్వేషపూరిత, అసభ్యకరమైన పోస్టులను నియంత్రించేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి పోస్టులకు సంబంధించి 1,384 కేసులు నమోదు చేసి, 1,067 మందిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచామని ఆమె సభకు తెలియజేశారు. గతంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ కూడా ‘వయసుకు తగిన సోషల్ మీడియా వాడకం’ కోసం చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్‌లను అధ్యయనం చేస్తామని ప్రకటించారు. “సోషల్ మీడియాపై నమ్మకం తగ్గిపోతోంది. పిల్లలు దాని వాడకంలో కూరుకుపోయి చదువుపై ఏకాగ్రత కోల్పోతున్నారు. మహిళలు ఆన్‌లైన్‌లో తీవ్రమైన




వేధింపులకు గురవుతున్నారు. దీన్ని ఉపేక్షించలేం” అని లోకేశ్ గతంలో ‘ఎక్స్’లో పోస్ట్ చేశారు. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, మెటా, ఎక్స్, గూగుల్, షేర్‌చాట్ వంటి ప్రధాన సోషల్ మీడియా సంస్థలను తదుపరి మంత్రుల బృందం సమావేశానికి ఆహ్వానించామని తెలిపారు. 16 ఏళ్లలోపు పిల్లలకు కొన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లపై ఆంక్షలు విధించే అవకాశాన్ని కూడా ఈ కమిటీ పరిశీలిస్తోంది. ఈ అంశాన్ని టీడీపీ జాతీయ స్థాయిలోనూ ప్రస్తావించింది. ఫిబ్రవరి 10న టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణ దేవరాయలు కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

# అవినీతిని ప్రశ్నిస్తున్నందుకే టార్గెట్ చేస్తున్నారు: విజయ్

ప్రభుత్వాల అవినీతిని, అక్రమాలను ప్రశ్నిస్తూ.. వాటికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నందుకే అందరూ తనను లక్ష్యంగా చేసుకుంటున్నారని టీవీకే చీఫ్ విజయ్ ఆరోపించారు. తమ పార్టీ నిర్వహించే బహిరంగ సభలకు కూడా డీఎంకే ప్రభుత్వం అనుమతి ఇవ్వట్లేదన్నారు. అందువల్లే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ప్రజలను కలవలేకపోతున్నానని వెల్లడించారు. టీవీకే ఎన్నికల్లో విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన అనంతరం ప్రతి గ్రామాన్ని సందర్శిస్తానని హామీ ఇచ్చారు. ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా.. వెనక్కి తగ్గనని అవినీతిని



ప్రశ్నిస్తూనే ఉంటానని అన్నారు. వేలూర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో విజయ్ మాట్లాడుతూ..ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో అవినీతి, నేరాలను అరికట్టడంలో స్టాలిన్ ప్రభుత్వం విఫలమయ్యిందని విజయ్ ఆరోపించారు. త్వరలో జరగనున్నవి ఎన్నికలు కాదని తమిళనాడు ప్రజలకు, అవినీతి ప్రభుత్వానికి మధ్య యుద్ధమని అన్నారు. ఈ యుద్ధంలో ప్రజలే విజయం సాధిస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో తనను ఎలాగైనా ఓడించాలనే ఆలోచనతో స్టాలిన్ కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకేకు ఓటు వేస్తే భాజపాకు వేసినట్లేనని అన్నారు. ఎన్నికల్లో ఓటమి భయంతో స్టాలిన్ ప్రభుత్వం భాజపాతో పొత్తు పెట్టుకోవాలని చూస్తోందని ఆరోపించారు. పరిస్థితులకు అనుగుణంగా మారిపోవడం ఆ పార్టీ నేతలకు అలవాటేనని దుయ్యబట్టారు. తాము అధికారంలోకి వస్తే రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడడానికి కఠిన చర్యలు తీసుకుంటానని విజయ్ అన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవ్వడానికి విద్యార్థులు లక్షల రూపాయలు వెచ్చించే అవసరం లేకుండా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోనే శిక్షణనిస్తామన్నారు. రాష్ట్రంలోని అన్ని మారుమూల ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు పరిశుభ్రమైన, సురక్షితమైన బాత్రూంలను ఏర్పాటు చేస్తామన్నారు. దేశంలోనే సురక్షితమైన రాష్ట్రంగా తమిళనాడును మారుస్తానని ప్రతిజ్ఞ చేశారు.

# స్నేహితుడికి సాయం చేయబోయి.. రూ.7కోట్ల సైబర్ నేరంలో చిక్కుకొని..

స్నేహితుడికి సాయం చేయబోయి.. 19 ఏళ్ల ఇంజినీరింగ్ విద్యార్థి రూ.7 కోట్ల సైబర్ నేరంలో చిక్కుకున్న ఘటన బెంగళూరులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బెంగళూరులోని ఓ ప్రముఖ కళాశాలలో ఇంజినీరింగ్ చేస్తున్న 19 ఏళ్ల విద్యార్థికి నవంబరులో అతడి స్నేహితుడు ఆయుష్ ఫోన్ చేశాడు. బ్యాంకు ఖాతాలో తగినంత బ్యాలెన్స్ లేకపోవడం వల్ల తన ఖాతా బ్లాక్ అయ్యిందని.. కొద్ది రోజుల పాటు వినియోగించుకోవడానికి బ్యాంకు ఖాతాను ఇవ్వాలని విద్యార్థిని కోరాడు. ఏడాదిగా అతడితో పరిచయం ఉండడంతో.. తన కర్ణాటక గ్రామీణ బ్యాంక్ పాస్‌బుక్, ఏటీఎం కార్డ్, నెట్ బ్యాంకింగ్ వివరాలు, ఖాతాకు లింక్ చేసి ఉన్న ఎయిర్‌టెల్ సిమ్ కార్డ్ వివరాలను విద్యార్థి



తన స్నేహితుడు ఆయుష్‌కు పంపించాడు. ఫిబ్రవరి 20న కర్ణాటక గ్రామీణ బ్యాంక్ అధికారులు సదరు విద్యార్థిని సంప్రదించి అతడి ఖాతా నుంచి అక్రమ లావాదేవీలు జరిగినట్లు తెలిపారు. షెల్ కంపెనీ పేరుతో కేవలం రెండు రోజుల్లోనే సైబర్ నేరగాళ్లు విద్యార్థి ఖాతా నుంచి రూ.7 కోట్లను వివిధ ఖాతాలకు మళ్లించినట్లు అధికారులు పేర్కొన్నారు. రంగంలోకి దిగిన సైబర్ క్రైమ్ పోలీసులు ఈ వ్యవహారానికి సంబంధించి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. విద్యార్థి స్నేహితుడు ఆయుష్‌కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఖాతా వివరాలను అతడు విదేశాల్లోని సైబర్ నేరగాళ్లకు విక్రయించినట్లు తెలిసింది. దీంతో వెంటనే సదరు ఖాతాను బ్లాక్ చేసినట్లు వెల్లడించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామన్నారు.

# ఎమ్మెల్యే మాధవరం ఆరోపణలను ఖండించిన హైడ్రా



* సున్నం చెరువు ఎఫ్‌టీఎల్ సరిహద్దులు మారబోవని చెప్పిన హైడ్రా
* ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆరోపణల్లో నిజం లేదని స్పష్టీకరణ
* 2014లో నిర్ధారించిన హద్దుల ప్రకారమే అభివృద్ధి పనులు జరుగుతున్నాయి
* ఆక్రమణలకు గురైన చెరువును 31 ఎకరాలకు విస్తరించామని వెల్లడి
* పేదలకు అన్యాయం, పెద్దలకు రక్షణ కల్పించే ఉద్దేశం లేదని స్పష్టత

మాదాపూర్‌లోని సున్నం చెరువు పూర్తిస్థాయి నీటిమట్టం (ఎఫ్‌టీఎల్) సరిహద్దుల్లో ఎలాంటి మార్పులు చేయడం లేదని హైడ్రా స్పష్టం చేసింది. చెరువు ఎఫ్‌టీఎల్ హద్దులను మార్చి అభివృద్ధి పనులు చేపడుతున్నారంటూ కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించింది. చెరువు అభివృద్ధి పనులను అత్యంత శాస్త్రీయంగా, పారదర్శకంగా చేపడుతున్నామని, ఇందులో ఎవరికీ అనుమానాలు అవసరం లేదని ఒక ప్రకటనలో పేర్కొంది. సున్నం చెరువు ఎఫ్‌టీఎల్‌ను 2014 మే నెలలోనే నిర్ధారించారని, ఆ సరిహద్దుల మేరకే ప్రస్తుతం పనులు చేపడుతున్నామని హైడ్రా వివరించింది. ఈ పనుల్లో పేదలకు అన్యాయం చేయడం గానీ, పెద్దలను కాపాడటం గానీ జరగడం లేదని తేల్చిచెప్పింది. ఒకప్పుడు ఆక్రమణలకు గురై కేవలం 14 ఎకరాలకు కుచించుకుపోయిన ఈ చెరువును, 2014లో ఇరిగేషన్ శాఖ నిర్ధారణ ప్రకారం 31 ఎకరాలకు విస్తరించిన విషయాన్ని గుర్తుచేసింది. ఇరిగేషన్, రెవెన్యూ వంటి సంబంధిత శాఖల సమన్వయంతోనే ఎఫ్‌టీఎల్ నిర్ధారణ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగిందని తెలిపింది. సోమవారం సున్నం చెరువును సందర్శించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు, అక్కడే ఉన్న ఇరిగేషన్ అధికారులు వాస్తవాలను వివరించారని హైడ్రా పేర్కొంది. 2014లో ఇరిగేషన్ శాఖ నిర్ణయించిన జియో కోఆర్డినేట్స్ (అక్షాంశాలు, రేఖాంశాలు) ప్రకారమే ఎఫ్‌టీఎల్ సరిహద్దులను గుర్తించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని స్పష్టం చేసింది. చెరువు ఎఫ్‌టీఎల్ సరిహద్దులు శాశ్వతమైనవని, వాటిని మార్చే ప్రసక్తే లేదని హైడ్రా తన ప్రకటనలో పునరుద్ఘాటించింది. ఈ విషయంలో అనవసర అపోహలు సృష్టించవద్దని కోరింది. చెరువు అభివృద్ధికి అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేసింది.



## తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల షెడ్యూల్ ఖరారు: మార్చి 20న బడ్జెట్ ప్రవేశపెట్టనున్న సర్కార్!

తెలంగాణ రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలకు ముహూర్తం ఖరారైంది. మార్చి 16 నుంచి మార్చి 30 వరకు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ 15 రోజుల పాటు సాగే సమావేశాల్లో రాష్ట్ర బడ్జెట్‌తో పాటు పలు కీలక బిల్లులపై చర్చ జరగనుంది.

**షెడ్యూల్ వివరాలు ఇవే**

శాసనసభ కార్యకలాపాలపై అందుతున్న సమాచారం ప్రకారం కీలక తేదీలు ఇలా ఉన్నాయి. మార్చి 16న గవర్నర్ ప్రసంగంతో అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తారు. మార్చి 17, 18న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరగనుంది. మార్చి 20న 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నారు.

**కీలక అంశాలపై చర్చ**

ఈ సమావేశాలు రాజకీయంగా కూడా అత్యంత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, సంక్షేమ పథకాల అమలు, పెండింగ్ బిల్లులు, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన నిధుల కేటాయింపులపై అధికార, ప్రతిపక్షాల మధ్య వాడివేడి చర్చ జరిగే అవకాశం ఉంది. ప్రభుత్వం తమ సంక్షేమ అజెండాను బడ్జెట్ రూపంలో ప్రజల ముందుకు తీసుకురావాలని చూస్తుండగా, విపక్షాలు హామీల అమలు, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సిద్ధమవుతున్నాయి.

## ఆ విషయంలో బీఆర్ఎస్ ఫెయిల్ అయింది..
# జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాం: కవిత

* జోగులాంబ గద్వాల జిల్లాలో రైతు సంఘర్షణ సభలో పాల్గొన్న కవిత
* భవిష్యత్తులో జోగులాంబ జిల్లా నుంచే కార్యక్రమాలు చేపడతామని హామీ
* నడిగడ్డను బీఆర్ఎస్ మోసం చేసిందన్న కవిత

బీఆర్ఎస్ పూర్తిగా ఫెయిల్ అయిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. జోగులాంబ గద్వాల జిల్లాలో జరిగిన 'రైతు సంఘర్షణ' సభలో ఆమె మాట్లాడుతూ, తనకు జోగులాంబ అమ్మవారు సెంటిమెంట్ అని తెలిపారు. తెలంగాణ ఉద్యమం సమయంలో ఏ కార్యక్రమం మొదలైనా ఉత్తర తెలంగాణలోని కరీంనగర్ జిల్లా నుంచి ఎక్కువగా ప్రారంభమయ్యేదని అన్నారు. కానీ భవిష్యత్తులో మనం ఏర్పాటు చేయబోయే పార్టీ మొదలు అన్నీ జోగులాంబ గద్వాల జిల్లా నుంచి ప్రారంభం చేయాలని నిర్ణయించుకున్నానని అన్నారు. ఇక్కడి నడిగడ్డ ప్రజలు నిజాయతీపరులని, అలాగే ఈ గడ్డపై నుంచి ఏ కార్యక్రమం ప్రారంభించినా జోగులాంబ అమ్మవారి ఆశీస్సులు ఉంటాయని భావిస్తున్నానని అన్నారు. పరిశ్రమలకు కరెంట్ ఇస్తున్నారు కానీ కష్టపడి పనిచేసే రైతులకు ఇవ్వడం లేదని విమర్శించారు. జోగులాంబ అమ్మవారి దయతో గద్వాల జిల్లా నుంచే తెలంగాణ జాగృతి జైత్రయాత్ర ప్రారంభమైందని అన్నారు. వడ్డేపల్లి మున్సిపాలిటీని తాము గెలుచుకున్నామని వెల్లడించారు. కానీ వడ్డేపల్లిలో తాము గెలిచిన తర్వాత తమ వారిని అధికార పార్టీ వారు దగ్గరకు తీసుకున్నారని మండిపడ్డారు. అసలు గద్వాల ఎమ్మెల్యే ఏ పార్టీలో ఉన్నారో చెప్పాలని సవాల్ చేశారు. ఏ పార్టీలో



ఉన్నారో చెప్పుకోలేని వారు ఎమ్మెల్యేగా ఉన్నారని మండిపడ్డారు. సమాధానం చెప్పకుంటే ఎమ్మెల్యే రాజీనామా చేయాలని సవాల్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ తనను సస్పెండ్ చేస్తే ఆ మరుక్షణం తాను ఆ పార్టీ నుంచి వచ్చిన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశానని గుర్తు చేశారు. రాజకీయాల్లో నీతి, నిజాయతీ, ధైర్యం ఉండాలని వ్యాఖ్యానించారు. మన ప్రాంతం నుంచే నీళ్లు పోతున్నాయి కానీ మనకు మాత్రం అందడం లేదని అన్నారు. నడిగడ్డ ప్రాంతానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా చేసిందేమీ లేదని అన్నారు. ప్రభుత్వంలో ఎవరున్నా ఇచ్చిన హామీలు నెరవేర్చేలా ప్రభుత్వాలతో పని చేయించడం కోసమే కొత్త పార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ఎవరు ఏమిచ్చినా తీసుకోవాలని, కానీ పని చేసేవారికి ఓటు వేయాలని సూచించారు. త్వరలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు వస్తున్నాయని, అప్పుడు డబ్బులు ఇచ్చినా తీసుకోవాలని, కానీ మీకోసం కొట్లాడే జాగృతి అభ్యర్థులకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఆడబిడ్డలకు నెలకు రూ.2,500, తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ ఎన్నికలకు ముందు చెప్పిందని గుర్తు చేశారు. కానీ ఈ హామీలు ఇప్పటి వరకు నెరవేర్చలేదని అన్నారు.

# తన పేరుతో సంస్థల ఏర్పాటుపై స్పందించిన కేటీఆర్

* కేటీఆర్ సేవా సమితి, కేటీఆర్ సేవ పేరుతో కార్యకలాపాలు
* తన పేరుతో ఎలాంటి సంస్థల నిర్వహణకు అనుమతి లేదని స్పష్టీకరణ
* ఎవరైనా పని చేయాలనుకుంటే బీఆర్ఎస్ పార్టీలో కలిసి పని చేయాలని సూచన



తన పేరుతో కొంతమంది సంస్థలను ఏర్పాటు చేసినట్లు వచ్చిన వార్తలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. తెలంగాణలో 'కేటీఆర్ సేవా సమితి', 'కేటీఆర్ సేన' పేరుతో కొన్ని సంస్థలు కార్యకలాపాలు చేపడుతుండటంపై ఆయన స్పందించారు. తన పేరుతో ఎలాంటి సంస్థల నిర్వహణకు అనుమతి లేదని వెల్లడించారు. అలాంటి వాటిని ఎట్టి పరిస్థితుల్లో ప్రోత్సహించేది లేదని స్పష్టం చేశారు. తన పేరుతో కార్యకలాపాలు నిర్వహించే సంస్థలకు ఎలాంటి గుర్తింపు, అనుమతి లేదనే విషయం అందరూ గుర్తించాలని అన్నారు. ఎవరైనా పనిచేయాలనుకుంటే కచ్చితంగా బీఆర్ఎస్ పార్టీ పరిధిలోనే చేయాలని కేటీఆర్ స్పష్టం చేశారు. తన పేరుతో పలు సంస్థల ద్వారా చేస్తున్న కార్యక్రమాలను నిలిపివేయాలని, తనపై అభిమానం ఉన్నవాళ్లు బీఆర్ఎస్ పార్టీతో కలిసి పనిచేయాలని సూచించారు.



## తెలంగాణ ఎడ్‌సెట్ 2026
# నోటిఫికేషన్ విడుదల.. మే 12న పరీక్ష

తెలంగాణలో ప్రభుత్వ టీచర్ ఉద్యోగం చేయాలనుకునే అభ్యర్థులకు కీలక అప్‌డేట్ వచ్చేసింది. 2026 విద్యా సంవత్సరానికి గాను రాష్ట్రస్థాయి ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (TG EdCET 2026) షెడ్యూల్‌ను అధికారులు విడుదల చేశారు. కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి, ఎడ్‌సెట్ చైర్మన్ ప్రొఫెసర్ కే ప్రతాప్ రెడ్డి సోమవారం ఈ వివరాలను వెల్లడించారు.

**ముఖ్యమైన తేదీలు ఇవే**

బీఈడీ (B.Ed) కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఈ పరీక్షకు సంబంధించిన ఆన్‌లైన్ ప్రక్రియ ఫిబ్రవరి నుంచి ప్రారంభం కానుంది. ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ఫిబ్రవరి 23, 2026 నుంచి ప్రారంభం కానుంది. దరఖాస్తుకు చివరి తేదీ (సాధారణ రుసుముతో) ఏప్రిల్ 15, 2026. పరీక్ష నిర్వహణ తేదీ మే 12, 2026 (రెండు సెషన్లలో ఆన్‌లైన్ విధానంలో). ఫలితాల విడుదల తేదీ మే 30, 2026. నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోలేని వారు కింద తెలిపిన విధంగా ఫైన్‌తో అప్లై చేసుకోవచ్చు. రూ.250 ఆలస్య రుసుముతో ఏప్రిల్ 22 వరకు, రూ.500 ఆలస్య రుసుముతో ఏప్రిల్ 27 వరకు, రూ.1000 ఆలస్య రుసుముతో ఏప్రిల్ 30 వరకు అవకాశం ఉంటుంది.

ఈ ఏడాది కూడా పరీక్షను పారదర్శకంగా నిర్వహించేందుకు ఆన్‌లైన్ (CBT) విధానంలోనే రెండు సెషన్లలో నిర్వహించనున్నట్లు ప్రొఫెసర్ ప్రతాప్ రెడ్డి తెలిపారు. అభ్యర్థులు మరిన్ని వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

## పెళ్లి పీటల వరకు వెళ్లేదాకా నమ్మకండి: యువతులకు సజ్జనార్ హెచ్చరిక

* నిశ్చితార్థం తర్వాత కూడా యువతులు అప్రమత్తంగా ఉండాలన్న సజ్జనార్
* పెళ్లి ఖాయమైందని శారీరకంగా లోబరుచుకుంటారని హెచ్చరిక
* పెళ్లి సమయం దగ్గర పడ్డాక తమ అసలు రంగు బయటపెడతారన్న సజ్జనార్
* అదనపు కట్నం కోసం డిమాండ్ చేస్తారని హెచ్చరిక

పెళ్లి పేరుతో జరుగుతున్న కొత్త తరహా మోసాలు ఇప్పుడు తీవ్ర కలకలం రేపుతున్నాయి. కేవలం ప్రేమ వ్యవహారాల్లోనే కాకుండా, పెద్దలు కుదిర్చిన సంబంధాల్లో కూడా యువతులు మోసపోతుండటంపై హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ కీలక హెచ్చరికలు జారీ చేశారు. నిశ్చితార్థం అయిన తర్వాత కూడా యువతులు అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. ప్రస్తుతం మోసగాళ్లు తమ పంథాను మార్చుకున్నారని, ముందుగా సంప్రదాయబద్ధంగా పెళ్లి చూపులు, నిశ్చితార్థం జరిపించుకుని... ఆ తర్వాత పెళ్లి ఖాయమైంది కదా అనే చనువును ఆసరాగా చేసుకుని యువతులతో సన్నిహితంగా మెలగడం, మాయమాటలతో వారిని ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ చేస్తూ శారీరకంగా లోబరుచుకోవడం వంటి ఘటనలు వెలుగులోకి వస్తున్నాయని సజ్జనార్ తెలిపారు. తీరా పెళ్లి సమయం దగ్గర పడ్డాక, తమ అసలు రంగును బయటపెడుతూ... అదనపు కట్నం కావాలని, లేదంటే పెళ్లి రద్దు చేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తన ట్వీట్‌లో పేర్కొన్నారు. అయితే, సమాజంలో పరువు పోతుందనే భయంతో చాలా మంది బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెనకాడుతున్నారు. బాధితుల మౌనాన్ని ఆసరాగా చేసుకుని ఈ కేటుగాళ్లు మరింతగా రెచ్చిపోతున్నారని షీ టీమ్స్ స్పష్టం చేస్తున్నాయని తెలిపారు. నిశ్చితార్థం అయినంత మాత్రాన గుడ్డిగా నమ్మకుండా, అబ్బాయి ప్రవర్తన, అతని స్నేహితులు, అతని అలవాట్లపై ముందే ఆరా తీయాలని సూచించారు. ముఖ్యంగా పెళ్లికి ముందే శారీరక సంబంధం కోసం ఒత్తిడి చేస్తే, అది కచ్చితంగా ప్రమాద సంకేతమని గ్రహించాలని హెచ్చరించారు. ఇలాంటి మోసగాళ్ల చేతిలో చిక్కుకున్న వారు భయపడకుండా ముందుకు రావాలని,



బాధితుల వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని ఆయన భరోసానిచ్చారు. ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే హైదరాబాద్ షీ టీమ్స్ వాట్సాప్ నంబర్ 9490616555 కు గానీ, లేదా అత్యవసరంగా డయల్ 100కు గానీ సమాచారం అందించాలని సూచించారు.




## ఉద్యమకారులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాల్సిందే..
# హైకోర్టు ఆదేశం

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం అహర్నిశలు పోరాడిన ఉద్యమకారులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాల్సిందేనని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపాల్ సెక్రటరీ, ఫ్రీడమ్ ఫైటర్ శాఖకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో అన్ని వర్గాలకు కాంగ్రెస్ పార్టీ హామీల వర్షం గుప్పించిన సంగతి తెలిసిందే. తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన ఉద్యమకారులకు ఇండ్ల స్థలాలు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. అయితే హామీని కాంగ్రెస్ పార్టీ నెరవేర్చకపోవడంతో.. తెలంగాణ ఉద్యమకారులకు పెన్షన్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలంటూ ఉద్యమ నాయకులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్లు, ఉద్యమకారుల తరుపున హైకోర్టు న్యాయవాది జి కరుణాకర్ రెడ్డి వాదనలు వినిపించారు. ఇరువురి వాదనలు విన్న అనంతరం అభయహస్తం స్కీం కింద దరఖాస్తు చేసుకున్న ఉద్యమకారులకు 8 వారాల్లో ఇండ్ల స్థలాలు, పెన్షన్లు ఇవ్వాలంటూ ప్రిన్సిపాల్ సెక్రెటరీ, ఫ్రీడమ్ ఫైటర్ శాఖకు హైకోర్టు న్యాయమూర్తి విజయసేన్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

# టీజీఎస్ ఆర్టీసీకి కొత్తగా 1,085 ఎలక్ట్రిక్ బస్సులు

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆర్టీసీ బస్సులను ఆధునీకరించే దిశగా భారీ అడుగు వేసింది. పర్యావరణ హితమైన ప్రజా రవాణాను ప్రోత్సహించే లక్ష్యంతో 1,085 ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేసేందుకు ఒలెక్ట్రా గ్రీన్ టెక్ లిమిటెడ్కు లెటర్ ఆఫ్ ఇంటెంట్ జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీఎం ఈడ్రైవ్ పథకంలో భాగంగా ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు.

*** హైదరాబాద్ కోసం అత్యాధునిక బస్సులు**

ఒలెక్ట్రా సంస్థ 12 మీటర్ల పొడవు గల లోఫ్లోర్ ఎలక్ట్రిక్ బస్సులను సరఫరా చేయనుంది. వీటిలో ఏసీ, నాన్ ఏసీ రెండు రకాల బస్సులు ఉంటాయి. మన రాష్ట్ర రోడ్ల పరిస్థితులకు అనుగుణంగా వీటిని రూపొందించారు.

* మైలేజ్: ఒక్కసారి ఛార్జ్ చేస్తే 250 కిలోమీటర్లకు పైగా ప్రయాణం.
* ఛార్జింగ్: కేవలం 45 నిమిషాల్లో ఆపర్చునిటీ ఛార్జింగ్ సౌకర్యం.

ఫీచర్లు: ఆధునిక ఎయిర్ సస్పెన్షన్ వ్యవస్థ, వీల్‌చైర్ వినియోగదారులకు ప్రత్యేక స్థలం.

ఎంఈఐఎల్ (MEIL) అనుబంధ సంస్థ అయిన ఒలెక్ట్రా, దేశంలోనే అతిపెద్ద విద్యుత్ వాణిజ్య వాహన తయారీ




సంస్థగా గుర్తింపు పొందింది. ప్రస్తుతం ఈ సంస్థ చేతిలో 10 వేల వాహనాల ఆర్డర్లు ఉండగా, ఇప్పటికే 3,600 వాహనాలను విజయవంతంగా ప్రవేశపెట్టింది. ఈ బస్సుల నిర్వహణను 'ఈవీ ట్రాన్స్ ప్రైవేట్ లిమిటెడ్' చూసుకోనుంది.

**పర్యావరణ హితం - చరిత్రాత్మక ఘట్టం**

ఈ సందర్భంగా ఒలెక్ట్రా ఎండీ మహేష్ బాబు మాట్లాడుతూ, "పీఎం ఈడ్రైవ్ కార్యక్రమం కింద వచ్చిన ఈ ప్రతిష్టాత్మక ఆర్డర్ మా ప్రయాణంలో కీలక మైలురాయి. హైదరాబాద్ మా స్వస్థలం మాత్రమే కాదు, ఆవిష్కరణలకు కేంద్రం కూడా. టీజీఎస్ఆర్టీసీతో కలిసి సుస్థిర ప్రజా రవాణా అందించేందుకు మేము కట్టుబడి ఉన్నాం" అని తెలిపారు. ఈ బస్సుల రాకతో హైదరాబాద్ నగరంలో కార్బన్ ఉద్గారాల తగ్గింపుతో పాటు, ప్రయాణికులకు మెరుగైన, శబ్ద కాలుష్యం లేని ప్రయాణ అనుభవం లభించనుంది.

# లాభాల్లో స్టాక్ మార్కెట్‌లు..

## జోష్ ఇచ్చిన బ్యాంకింగ్, హెల్త్‌కేర్ షేర్లు



**ముంబై:** భారత స్టాక్ మార్కెట్‌లు లాభాల్లో ముగిశాయి. ఇవాళ్టి ట్రేడింగ్‌లో పబ్లిక్ సెక్టార్ యూనిట్లైన బ్యాంకింగ్, హెల్త్‌కేర్ రంగాల షేర్లలో కొనుగోళ్ల జోష్ కనిపించింది. ఈ కొనుగోళ్ల మద్దతుతో సూచీలు సానుకూలంగా ముగిశాయి. సుంకాలపై అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు రావడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌కు బలాన్ని ఇచ్చింది.

ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 479.95 పాయింట్లు పెరిగి 83,294.66 వద్ద స్థిరపడింది. అదేవిధంగా నిఫ్టీ 141.75 పాయింట్లు లాభపడి 25,713 వద్ద ముగిసింది. సెన్సెక్స్ స్టాక్స్‌లో అదానీ పోర్ట్స్ 2.82 శాతం లాభంతో టాప్ గెయినర్‌గా నిలిచింది. కోటక్ మహీంద్రా బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, పవర్ గ్రిడ్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కూడా లాభపడ్డాయి. మరోవైపు టెక్నాలజీ షేర్‌లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి.

ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ప్రధానంగా నష్టాల్లో ఉన్నాయి. వీటితోపాటు ట్రెంట్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఐటీసీ లిమిటెడ్ షేర్లు కూడా నష్టపోయాయి. ఇక రంగాల వారీగా చూస్తే.. నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ 1.36 శాతం, నిఫ్టీ మిడ్‌స్మాల్ హెల్త్‌కేర్ ఇండెక్స్ 1.03 శాతం మేర పెరిగాయి. అయితే, నిఫ్టీ ఐటీ సూచీ నష్టాలతో ముగిసింది.

అదేవిధంగా బ్రాడర్ మార్కెట్లలో మిశ్రమ ధోరణి కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.43 శాతం క్షీణించగా, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.29 శాతం లాభంతో ముగిసింది. మార్కెట్ నిపుణుల ప్రకారం.. నిఫ్టీకి తక్షణ ప్రతిఘటన 25,800 వద్ద, కీలక మద్దతు 25,500 వద్ద కొనసాగుతోంది.

# ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో రూ.590 కోట్ల మోసం..

## హర్యానా ప్రభుత్వ ఖాతాల్లో గుర్తింపు




**చండీగఢ్:** ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో రూ.590 కోట్ల మోసం జరిగింది. హర్యానా ప్రభుత్వ బ్యాంకు ఖాతాల్లో ఈ ఫ్రాడ్ జరిగినట్లు ఆ బ్యాంకు గుర్తించింది. అక్రమాలకు పాల్పడిన నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేసింది. ఈ మోసం విషయాన్ని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ)కు నివేదించింది. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ చండీగఢ్ బ్రాంచ్‌లో హర్యానా ప్రభుత్వంలోని పలు డిపార్ట్‌మెంట్లకు బ్యాంకు ఖాతాలు ఉన్నాయి.

కాగా, తమ బ్యాంకు ఖాతా మూసివేసి ఆ నిధులను మరో బ్యాంకు ఖాతాకు బదిలీ చేయాలని హర్యానా ప్రభుత్వానికి చెందిన ఒక డిపార్ట్‌మెంట్ ఇటీవల ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌ను కోరింది. అయితే ఆ డిపార్ట్‌మెంట్ పేర్కొన్న మొత్తం, బ్యాంకు ఖాతాలోని బ్యాలెన్స్ మధ్య భారీ వ్యత్యాసం కనిపించింది. ఫిబ్రవరి 18 తర్వాత పలు హర్యానా ప్రభుత్వ సంస్థలు కూడా వాటి ఖాతాల్లో చూపుతున్న బ్యాలెన్స్ వ్యత్యాసాలపై ఆందోళన వ్యక్తం చేశాయి.

మరోవైపు ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ అప్రమత్తమైంది. ఫిబ్రవరి 20న అంతర్గత ఆడిట్ కోసం ప్రత్యేక కమిటీ సమావేశమైంది. పూర్తి బోర్డు మీటింగ్ కూడా నిర్వహించింది. చండీగఢ్ బ్రాంచ్‌లోని హర్యానా ప్రభుత్వ అనుసంధాన ఖాతాల్లో రూ.590 కోట్ల మోసం జరిగినట్లు గుర్తించింది. అనుమానాస్పద లబ్ధిదారుల ఖాతాలు గుర్తించడంతో పాటు డబ్బు రీకాల్ కోసం ఇతర బ్యాంకులకు అభ్యర్థనలు పంపింది.

కాగా, తమ బ్యాంకులో రూ.590 కోట్ల మోసాన్ని గుర్తించినట్లు ఫిబ్రవరి 22న ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ అధికారికంగా ప్రకటించింది. చండీగఢ్ బ్రాంచ్‌లోని హర్యానా ప్రభుత్వ బ్యాంకు ఖాతాలకే ఈ మోసం పరిమితమైనట్లు పేర్కొంది. పూర్తి దర్యాప్తు తర్వాత ఎంత మోసం జరిగిందో తెలుస్తుందని వెల్లడించింది.

మరోవైపు అక్రమాలకు పాల్పడిన నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేసినట్లు ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ తెలిపింది. ఈ మోసంలో ఇతర వ్యక్తుల ప్రమేయం కూడా ఉన్నట్లు స్పష్టం చేసింది. ఈ ఫ్రాడ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు ఆర్బీఐకి నివేదిక ఇచ్చినట్లు పేర్కొంది. ఈ మేరకు స్టాక్ ఎక్స్ఛేంజీలకు కూడా సమాచారం ఇచ్చింది.

ఈ పరిణామాల నేపథ్యంలో సోమవారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ షేర్లు సుమారు 20 శాతం పడిపోయాయి. హర్యానా ప్రభుత్వం కూడా సీరియస్‌గా స్పందించింది. ఆ బ్యాంకుతో అన్ని లావాదేవీలను తాత్కాలికంగా నిలిపివేసింది.

# రూ.2 వేల వరకు పెరిగిన తులం ధర

## రూ.25 వేలు అధికమైన కిలో వెండి



**న్యూఢిల్లీ:** గత కొన్ని రోజులుగా తగ్గిన బంగారం ధరలు మళ్లీ కొండెక్కుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాల ధరలు రాకెట్ వేగంతో దూసుకుపోవడంతో దేశీయంగా ధరలు మూడు శాతం వరకు అధికమయ్యాయి. కిలో వెండి ఏకంగా రూ.2.7 లక్షలకు చేరుకోగా, బంగారం రూ.1.6 లక్షలు పలికింది. ఫలితంగా న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల బంగారం ధర రూ.3,300 లేదా 2 శాతం ఎగబాకి రూ.1,62,800కి చేరుకున్నది.

అంతకుముందు ఇది రూ.1,59,500గా ఉన్నది. అలాగే కిలో వెండి రూ.8 వేలు లేదా 3.03 శాతం ఎగబాకి రూ.2.72 లక్షలకు చేరుకున్నది. ఇటు హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ పదిగ్రాముల గోల్డ్ ధర రూ.2,070 ఎగబాకి రూ.1,61,350 పలికింది. అలాగే 22 క్యారెట్ ధర రూ.1,900 అందుకొని రూ.1,47,900కి చేరుకున్నది. వెండి రూ.10 వేలు అందుకొని రూ.3 లక్షలకు చేరుకున్నది.

ట్రంప్‌నకు వ్యతిరేకంగా అమెరికా సుప్రీంకోర్టు తీర్పునివ్వడంతోపాటు అమెరికా-ఇరాన్‌ల మధ్య యుద్ధమేఘాలు కమ్ముకుంటుండటం ధరలు పుంజుకోవడానికి ప్రధాన కారణాలని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 3 శాతం లేదా 154 డాలర్లు ఎగబాకి 5,235 డాలర్లు పలుకగా, వెండి 6 శాతం లేదా 4.87 డాలర్లు అందుకొని 87 డాలర్లకు చేరుకున్నది.

# సూపర్ 8లో తడబడిన జింబాబ్వే..

## 107 రన్స్‌తో గెలుపొందిన వెస్టిండీస్..

**వాంఖడే:** లీగ్ దశలో ఆస్ట్రేలియా, శ్రీలంక వంటి మేటిజట్లను ఓడించిన జింబాబ్వే నాకౌట్‌లో చతికిలపడింది. వాంఖడే మైదానంలో వెస్టిండీస్ హిట్టర్లను నిలువరించలేక.. ఆపై స్పిన్నర్లను ఎదుర్కోలేక చిత్తుగా ఓడింది. షిమ్రన్ హెట్‌మైర్(85), రొవ్‌మన్ పావెల్(59) విధ్వంసంతో కరీబియన్ టీమ్ రికార్డు స్కోర్ కొట్టడంతో డీలా పడిన జింబాబ్వే.. భారీ ఛేదనలో పవర్ ప్లేలోనే తడబడింది. ఆరంభంలోనే గుడకేశ్ మోతీ(4-28) తిప్పేసి కోలుకోలేని దెబ్బకొట్టాడు. మేయర్స్(28), సికిందర్ రజా(27) మినహా అందరూ చేతులెత్తేయగా ఆఖర్లో






ఎవాన్స్(43) మెరుపులతో పరుగుల అంతరం తగ్గించాడు. 107 పరుగుల భారీ విజయంతో గ్రూప్ ఏలో సెమీస్ రేసులోకి దూసుకెళ్లింది కరీబియన్ జట్టు. ప్రపంచకప్‌లో సంచలన విజయాలతో నాకౌట్ బెర్తు పట్టేసిన జింబాబ్వేను వెస్టిండీస్ గజగజ వణికించింది. మూడో టైటిల్ వేటలో అదరగొడుతున్న విండీస్.. సోమవారం కొండంత స్కోర్‌తో ఆఫ్రికా జట్టు ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసింది. అనంతరం స్పిన్నర్లు వికెట్ల వేటతో ప్రత్యర్థి బ్యాటర్లను వణికించగా.. ఫీల్డింగ్‌లో మెరికల్లా కదిలిన విండీస్ ఆటగాళ్లు అన్ని క్యాచ్‌లు ఒడిసిపట్టారు. ఫలితంగా.. జింబాబ్వే 147కే పరిమితమవ్వగా.. 107 పరుగుల భారీ తేడాతో షాయ్ హోప్ సేన గెలుపొందింది. దాంతో.. రజా సారథ్యంలోని జింబాబ్వే విజయ ప్రస్థానికి తెరపడింది.

### మోతీ పడగొట్టగా..

తొలి ఓవర్లో ఫోర్, సిక్సర్ బాదిన ఓపెనర్ మరుమని(14) ఆ తర్వాతి ఓవర్లోనే హిట్‌మైర్ చేతికి చిక్కాడు.. లీగ్ దశలో నాటౌట్‌గా జింబాబ్వే విజయాల్లో కీలకమైన బ్రియాన్ బెన్నెట్(5)ను అకీల్ హొసేన్ బౌల్డ్ చేయగా.. రియాన్ బర్ల్ (0) పెద్ద షాట్‌కు యత్నించి హిట్‌మైర్ క్యాచ్ పట్టగా వెనుదిరిగాడు. 20 పరుగులకే మూడు వికెట్లు పడిన వేళ.. టోనీ మైయర్స్(28), సికిందర్ రజా(27)లు ఇన్నింగ్స్ చక్కదిద్దే ప్రయత్నించారు. కానీ, ఈ ఇద్దరినీ బౌల్డ్ చేశాడు మోతీ.

విండీస్ స్పిన్నర్ల ధాటికి.. టోనీ మున్యోంగా(14) కాసేపు నిలబడినా అతడినీ మోతీ డగౌట్ పంపాడు. మిగతా వారు ఇలా వచ్చి అలా పెవిలియన్ చేరగా.. చివర్లో ఎవాన్స్(43) బౌండరీలతో అలరించాడు. హోల్డర్‌ను ఉతికేస్తూ.. వరుసగా 4, 6, 6 బాదాడు. అర్ధ శతకానికి చేరువైన అతడిని ఫోర్డ్ వెనక్కి పంపడంతో .. విండీస్ 107 పరుగుల భారీ తేడాతో జయభేరి మోగించింది.

### వాంఖడేలో హిట్‌మైర్ తుఫాన్

సూపర్ 8 తొలి మ్యాచ్‌లో వెస్టిండీస్ బ్యాటర్లు చెలరేగిపోయారు. సంచలన ఆటతో నాకౌట్‌కు దూసుకొచ్చిన జింబాబ్వేను వణికిస్తూ.. షిమ్రన్ హిట్‌మైర్(85) ఊచకోతకు తెగబడ్డాడు. అరేబియా సముద్రపు సమీపంలోని వాంఖడే మైదానంలో తుఫాన్‌లా చెలరేగాడు. రోవ్‌మన్ పావెల్(59) జతగా జింబాబ్వే బౌలర్లకు చుక్కలు చూపించాడు. వీరిద్దరి దూకుడుతో విండీస్ స్కోర్‌బోర్డు పరుగులు తీసింది. వీరిద్దరూ ఔటయ్యాక.. షెర్ఫానే రూథర్‌ఫోర్డ్(31 నాటౌట్), రొమారియో షెపర్డ్(21)లు తమ స్టయిల్లో ఫినిషింగ్ టచ్ ఇచ్చారు. ఫలితంగా ఈ సీజన్‌లోఅత్యధిక పరుగుల(254) రికార్డు స్కోర్‌తో విండీస్ చరిత్ర లిఖించింది.

# దక్షిణాఫ్రికా పర్యటనకు ఆస్ట్రేలియా..

## ఆ వివాదం తర్వాత ఎనిమిదేళ్లకు..!

**సిడ్నీ:** ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో అగ్రస్థానంలో కొనసాగుతున్న ఆస్ట్రేలియా సుదీర్ఘ విరామం తర్వాత దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లనుంది. సాండ్‌పేపర్‌గేట్ వివాదం తర్వాత ఎనిమిదేళ్లకు ఆసీస్ ఆ దేశంలో అడుగుపెట్టనుంది. రెండు ఫార్మాట్ల సిరీస్‌లో ప్యాట్ కమిన్స్ సారథ్యంలోని కంగారూ టీమ్ సఫారీలతో తలపడనుంది. ఇరుజట్ల మధ్య మొదట వన్డే, ఆపై టెస్టు సిరీస్ జరుగనుంది. రెండు దేశాల బోర్డులు సోమవారం ఈ విషయాన్ని ధ్రువీకరించాయి.

డబ్ల్యూటీసీలో ఆస్ట్రేలియా సెప్టెంబర్‌లో కీలకమైన సిరీస్ ఆడనుంది. దక్షిణాఫ్రికాతో మూడు టెస్టుల్లో కమిన్స్ సేన అమీతుమీ తేల్చుకోనుంది. సఫారీలపై 2018లో సాండ్‌పేపర్ గేట్ వివాదం తర్వాత ఆసీస్ జట్టుకు ఇదే తొలి పర్యటన. అప్పుడు స్టీవ్ స్మిత్ సారథ్యంలో ఆడిన కంగారూలు.. కేప్‌టౌన్ టెస్టులో అనూహ్యంగా వివాదంలో చిక్కుకున్నారు. కామెరూన్ బాన్‌క్రాఫ్ట్ బంతి ఆకారాన్ని మార్చేందుకు సాండ్ పేపర్‌తో రుద్దడం వీడియోల్లో రికార్డైంది. అతడికి కెప్టెన్ స్మిత్, వైస్ కెప్టెన్ డేవిడ్ వార్నర్ సహకరించారు. దాంతో.. ఈ ముగ్గురిపై ఆస్ట్రేలియా క్రికెట్ నిషేధం విధించింది.

విచారణ అనంతరం స్మిత్, వార్నర్ ఏడాదిపాటు సస్పెండ్ అయ్యారు. బాన్‌క్రాఫ్ట్ 9




నెలలు ఆటకు దూరమయ్యాడు. ఈ ఘటనతోనే స్మిత్ కెప్టెన్సీ పోగుట్టుకోగా.. టిమ్ పైన్ నయా సారథిగా ఎంపికయ్యాడు. ఎనిమిదేళ్ల విరామం తర్వాత ఆసీస్ మళ్లీ కేప్‌టౌన్‌లో టెస్టు మ్యాచ్ ఆడనుంది. అప్పుడు జట్టు సభ్యులైన కమిన్స్, లియన్, మిచెల్ స్టార్క్, హేజిల్‌వుడ్‌లు ఈసారి కూడా ఆడబోతున్నారు.

**వన్డే సిరీస్ :** తొలి వన్డే - సెప్టెంబర్ 24, కింగ్స్‌మీడ్ స్టేడియం, డర్బన్.

రెండో వన్డే -సెప్టెంబర్ 27, వాండెరరన్స్ స్టేడియం (జొహన్నెస్‌బర్గ్).

మూడో వన్డే (డే /నైట్) - సెప్టెంబర్ 30న జేబీ మార్క్స్ ఓవల్ స్టేడియంలో.

**టెస్టు సిరీస్ :** తొలి టెస్టు అక్టోబర్ 9-13, కింగ్స్‌మీడ్ స్టేడియం, డర్బన్.

రెండో టెస్టు అక్టోబర్ 18-22, సెయింట్ జార్జ్స్ పార్క్, కెబెర్హా.

మూడో టెస్టు అక్టోబర్ 27-31, న్యూలాండ్స్ క్రికెట్ గ్రౌండ్, కేప్‌టౌన్.

# పవర్‌ప్లేలోనే ఓడిపోయాం..

## కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్

## టీ20 ప్రపంచకప్ సూపర్-8లో భారత్‌కు ఎదురుదెబ్బ

## దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో 76 పరుగుల తేడాతో ఘోర పరాజయం

## పవర్‌ప్లేలో వికెట్లు కోల్పోవడమే కారణమన్న కెప్టెన్ సూర్యకుమార్

## సెమీస్ రేసులో నిలవాలంటే జింబాబ్వేపై భారీ విజయం తప్పనిసరి



**న్యూఢిల్లీ:** టీ20 ప్రపంచకప్ 2026 సూపర్-8 దశలో భారత జట్టుకు చేదు ఆరంభం ఎదురైంది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి మ్యాచ్‌లో టీమిండియా 76 పరుగుల భారీ తేడాతో ఓటమిపాలైంది. 188 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్, ప్రత్యర్థి బౌలర్ల ధాటికి 18.5 ఓవర్లలో 111 పరుగులకే కుప్పకూలింది.

లక్ష్య ఛేదనలో భారత బ్యాటింగ్ ఆర్డర్ పేకమేడలా కూలిపోయింది. ముఖ్యంగా పవర్‌ప్లేలో ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, అభిషేక్ శర్మ వంటి కీలక బ్యాటర్లు పెవిలియన్ చేరడం జట్టును తీవ్రంగా దెబ్బతీసింది. మ్యాచ్ అనంతరం ఓటమిపై కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ స్పందించాడు. బ్యాటింగ్ వైఫల్యాన్నే ఓటమికి ప్రధాన కారణంగా పేర్కొన్నాడు. "భారీ లక్ష్య ఛేదనలో పవర్‌ప్లేలోనే మ్యాచ్ గెలవలేం కానీ, వికెట్లు కోల్పోతే అక్కడే ఓడిపోతాం. మా విషయంలో అదే జరిగింది" అని ఆయన విశ్లేషించాడు. అయితే బౌలింగ్‌లో జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్ అద్భుతంగా రాణించి ఐదు వికెట్లు పడగొట్టారని ప్రశంసించాడు.

ఈ ఓటమి నుంచి పాఠాలు నేర్చుకొని పుంజుకుంటామని సూర్య ధీమా వ్యక్తం చేశాడు. చెన్నైలో జింబాబ్వేతో జరగనున్న తదుపరి మ్యాచ్‌లో తమ దూకుడైన ఆటతీరును కొనసాగిస్తామని స్పష్టం చేశాడు. తాజా ఓటమితో భారత నెట్ రన్‌రేట్ భారీగా పడిపోయింది. దీంతో సెమీఫైనల్ ఆశలు సజీవంగా ఉండాలంటే తదుపరి మ్యాచ్‌లో జింబాబ్వేపై భారీ తేడాతో గెలవడం అత్యంత కీలకంగా మారింది.

# భారీ ఓటమితో మైనస్‌లో టీమిండియా..

## సెమీస్ బెర్తుపై ఉత్కంఠ..!

**న్యూఢిల్లీ:** లీగ్ దశలో ఓటమెరుగని భారత జట్టు కీలకమైన సూపర్ 8లో మాత్రం ఘోరంగా విఫలమైంది. దక్షిణాఫ్రికా టాపార్డర్ జోరుకు కళ్లెం వేసి.. మధ్యలో పట్టు సడలించి.. ఆఖర్లో పంజా విసిరిన టీమిండియా.. ఛేదనలో మాత్రం తేలిపోయింది. 188 పరుగుల లక్ష్యాన్ని ఉఫ్ మనిపిస్తుందనుకుంటే.. సమిష్టి వైఫల్యంతో సఫారీలకు సరెండరైంది. ఊహించని విధంగా సూర్యకుమార్ యాదవ్ సేన పోరాడకుండానే మ్యాచ్‌ను అప్పగించేసిందనే బాధ అభిమానులను వెంటాడుతోంది. 76 పరుగుల తేడాతో ఓడిన కారణంగా నెట్ రన్‌రేటు మైనస్‌లో ఉంది. ఈ పరిస్థితుల్లో భారత్ సెమీస్ చేరడంపై సందిగ్ధం నెలకొంది.

గ్రూప్ ఏ నుంచి టేబుల్ టాపర్‌గా సూపర్ 8లో అడుగుపెట్టిన భారత జట్టును నేలకు దించింది దక్షిణాఫ్రికా. ప్రస్తుతం భారత్ నెట్‌రన్‌రేటు మైనస్(-3.800)లో ఉంది. చివరి రెండు మ్యాచుల్లో భారీ తేడాతో గెలిస్తేనే సెమీస్ అవకాశాలుంటాయి. ఫిబ్రవరి 26న చిదంబరం స్టేడియంలో జింబాబ్వేతో.. మార్చి 1న వెస్టిండీస్‌తో సూర్యకుమార్ సేన తలపడనుంది.

ఈ రెండు జట్లను ఓడిస్తే నాలుగు పాయింట్లతో టీమిండియా రేసులో ఉంటుంది. కానీ, లీగ్ దశలో ఆస్ట్రేలియా, శ్రీలంకను ఓడించిన జింబాబ్వేను తక్కువ అంచనా వేయడానికి లేదు. ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్ కెప్టెన్ సికిందర్ రజా.. పేసర్లు ముజరబని, ఎవాన్స్, స్పిన్నర్ గ్రీవ్స్ సూపర్ ఫామ్‌లో ఉన్నారు. సెమీస్‌పై కన్నేసిన ఆఫ్రికా జట్టును ఓడించడం అసాధ్యమని



చెప్పలేం కానీ.. సమిష్టిగా రాణిస్తేనే అది సాధ్యమవుతుంది.

అలానే.. వెస్టిండీస్ సైతం సమిష్టిగా రాణిస్తూ మాతో కష్టమే హెచ్చరికలు పంపుతోంది. షాయ్ హోప్ సారథ్యంలో ప్రమాదకరంగా పరిణమిస్తున్న విండీస్.. మూడో కప్ వేటలో పక్కాగా ఆడుతోంది. లీగ్ దశలో ఇంగ్లండ్‌ను ఓడించిన కరీబియన్ జట్టుపై భారత్‌కు మెరుగైన రికార్డే ఉంది. సో.. కచ్చితంగా ఓడిస్తేనే టీమిండియాకు సెమీస్ అవకాశాలుంటాయి. రెండుకు రెండు గెలవడమే కాకుండా దక్షిణాఫ్రికా తదుపరి మ్యాచుల ఫలితాలు కూడా కీలకం కానున్నాయి. జింబాబ్వే, వెస్టిండీస్‌తో సఫారీ టీమ్ ఓడాలి. అప్పుడు సూర్యకుమార్ సేన సెమీస్ బెర్తుకు దగ్గరవుతుంది. ఒకవేళ.. సఫారీ టీమ్ రెండు మ్యాచుల్లోనూ గెలిస్తే.. గ్రూప్ ఏ నుంచి రెండో స్థానం కోసం జింబాబ్వే, విండీస్, భారత్ మధ్య తీవ్ర పోటీ నెలకొంటుంది.

### బెడిసికొట్టిన సుందర్ ప్రయోగం..!

డిఫెండింగ్ ఛాంపియన్‌గా టీ20 వరల్డ్‌కప్ బరిలో నిలిచిన భారత జట్టు అంచనాలకు తగ్గట్టే లీగ్ దశను అజేయంగా ముగించింది. నాకౌట్‌లోనూ దక్షిణాఫ్రికాను చిత్తు చేస్తుందని అందరూ అనుకున్నారు. ఎందుకంటే.. ప్రపంచకప్‌లో సఫారీలపై 5-2 విజయాల రికార్డు ఉంది. కానీ, అహ్మదాబాద్‌లో భారత క్రికెటర్ల ఆట లయ తప్పింది.

అక్షర్ పటేల్‌ను తప్పించి తుది జట్టులోకి సుందర్‌ను తీసుకోవడం బెడిసికొట్టగా.. తొలి ఓవర్లోనే ఇషాన్ కిషన్ డకౌటవ్వడం.. ఆపై యాన్సెన్ తొలి బంతికే తిలక్ వర్మను వెనక్కి పంపడంతో భారత్ ఒత్తిడిలో పడింది. 6, 4తో టచ్‌లోకి వచ్చినట్టే కనిపించిన అభిషేక్ శర్మ సైతం పవర్ ప్లేలోనే వెనుదిరిగాడు. చూస్తుండగానే మూడు వికెట్లు పడిన వేళ.. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యాలు బ్యాట్ ఝులిపించి ప్రొటీస్ బౌలర్లపై పైచేయి సాధించలేదు.

బుమ్రా, అర్ష్‌దీప్ విజృంభణతో 20కే మూడు వికెట్లు పడిన సఫారీ టీమ్‌ను డేవిడ్ మిల్లర్, డెవాల్డ్ బ్రెవిస్ విధ్వంసక ఆటతో ఆదుకున్నట్టు సూర్య, పాండ్యా భారత్‌ను గట్టెక్కించలేదు. వీరూ పెద్ద షాట్లకు యత్నించక సింగిల్స్ తీస్తూ ఉండడంతో మ్యాచ్ చేజారుతూ వచ్చింది. వీరిద్దరూ ఔటయ్యాక రింకూ సింగ్ సిక్సర్‌తో ఆశలు రేపినా.. తర్వాత బంతికే వికెట్ ఇచ్చేశాడు. వరల్డ్‌కప్‌లో తీవ్రంగా నిరాశపరుస్తున్న ఈ ఐపీఎల్ స్టార్ ఆదుకుంటాడనుకుంటే ఉసూరుమనిపించాడు. శివం దూబే(43) ఒంటరి సైనికుడులా పోరాడినా సరిపోలేదు. ఫలితంగా.. 111కే కుప్పకూలిన టీమిండియా.. 76 పరుగుల తేడాతో ఓడింది.

MOVIE TIME

## ది ప్యారడైజ్ నుంచి ప్రోమో సాంగ్ విడుదల




**టాకీస్:** నాని హీరోగా దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న చిత్రం 'ది ప్యారడైజ్'. మోహన్‌బాబు కీలకపాత్రలో కనిపించనున్నారు. ఆగస్టు 21న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో దీని మొదటి పాటను విడుదల చేసేందుకు సిద్ధమయ్యారు. తాజాగా 'ఆయా షేర్' అనే సాంగ్ ప్రోమోను విడుదల చేశారు. పూర్తి పాట ఫిబ్రవరి 24న రానుంది. అనిరుధ్ అందించిన సంగీతం జోష్ పెంచేలా కనిపిస్తోంది. ఇదిలావుంటే నేచురల్ స్టార్ నాని వరుస క్రేజీ ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్నారు. 'ది ప్యారడైజ్'లో నాని పూర్తిగా కొత్త గెటప్‌లో, ఊర మాస్ క్యారెక్టర్‌లో కనిపించనున్నట్లు సమాచారం. ఈ పాత్ర కోసం ఆయన తన లుక్‌ను పూర్తిగా మార్చుకోవడం విశేషం. రగ్డ్ స్టైల్, ఇంటెన్స్ బాడీ లాంగ్వేజ్‌తో నాని మరోసారి మాస్ ఆడియన్స్‌ను టార్గెట్ చేస్తున్నాడని టాక్ వినిపిస్తోంది. 'దసరా'లో చూపించిన రా ఎనర్జీకి మించి ఈసారి మరింత పవర్‌ఫుల్ ప్రెజెన్స్ ఉంటుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి.

## అల్లువారింట పెళ్లి సందడి

### పవన్, నాగబాబు దంపతులకు ఆహ్వానం






**టాకీస్:** అల్లు వారింట పెళ్లి పనులు ఫుల్ జోష్‌లో జరుగుతున్నాయి. ఒకవైపు పసుపు దంచే కార్యక్రమాలు.. మరోవైపు బ్యాచిలర్ పార్టీలతో కొన్ని రోజుల నుంచి శిరీష్-నయనికల ఫొటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. తాజాగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎమ్మెల్సీ నాగబాబును పెళ్లికి ఆహ్వానించారు. సతీ సమేతంగా పవన్ కల్యాణ్, నాగబాబుల ఇళ్లకు వెళ్లిన అల్లు అరవింద్.. వారికి నూతన వస్త్రాలు అందించి పెళ్లికి పిలిచారు. మార్చి 6న అల్లు శిరీష్ -నయనిక ఒకటి కానున్నారు. ఈ వేడుకకు ఇప్పటికే చిరంజీవికి ఆహ్వానం అందిన విషయం తెలిసిందే. ఇటీవలే పసుపు దంచే కార్యక్రమం జరిగింది. ఆ ఫొటోలను అల్లు అర్జున్ సతీమణి స్నేహ తన ఇన్‌స్టాలో పంచుకున్నారు. హైదరాబాద్‌లోనే వీరి పెళ్లి జరగనున్నట్లు తెలుస్తోంది. కుటుంబసభ్యులు, అత్యంత సన్నిహితులు ఈ వేడుకకు హాజరవుతారని సమాచారం. ఇక ఇటీవలే దుబాయ్‌లో ఫ్రెండ్స్ సర్కిల్‌కు బ్యాచ్‌లర్ పార్టీ ఇచ్చారు. అక్కడి నుంచి వచ్చాక ఫిబ్రవరి 20న అల్లు అర్జున్ హైదరాబాద్‌లో కుటుంబ సభ్యులకు, టాలీవుడ్ నటీనటులకు పార్టీ ఏర్పాటు చేశారు. ఈ వేడుకలో రామ్ చరణ్ దంపతులతో పాటు శ్రీలీల, మృణాల్, ఫరియా అబ్దుల్లా మరికొందరు సందడి చేశారు.



## శ్రీలీలని పలకరిస్తున్న వరుస ఫ్లాపులు..

### అయిన కూడా ఏకంగా స్టార్ హీరో సరసన ఛాన్స్?

టాకీస్: సౌత్ ఇండస్ట్రీలో యంగ్ హీరోయిన్లలో అచ్చ తెలుగమ్మాయిగా గుర్తింపు తెచ్చుకున్న శ్రీలీల వరుస అవకాశాలతో దూసుకుపోతోంది. ఎనర్జీ, డ్యాన్స్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో తక్కువ సమయంలోనే ఆమె మంచి గుర్తింపు సంపాదించింది. రవితేజతో చేసిన ధమాకా ద్వారా తెలుగులో తొలి భారీ హిట్ అందుకున్న ఈ బ్యూటీ, హిట్లు- ఫ్లాపులతో సంబంధం లేకుండా వరుసగా ఛాన్సులు దక్కించుకుంటూ బిజీగా మారింది. తన టాలెంట్‌తో నిర్మాతల దృష్టిని ఆకర్షిస్తూ కమర్షియల్ సినిమాల్లో ప్రత్యేక ఇమేజ్‌ను నిర్మించుకుంది. టాలీవుడ్‌లో స్టార్ హీరోల సరసన నటించిన శ్రీలీల, మాస్ ఎంటర్‌టైనర్ల నుంచి లవ్ స్టోరీల వరకు విభిన్న కథలను ఎంచుకుంటూ కెరీర్‌ను విస్తరించుకుంటోంది.

ఇదే సమయంలో కోలీవుడ్‌పైనా దృష్టి సారించింది. శివకార్తికేయన్ హీరోగా తెరకెక్కిన పరాశక్తి చిత్రంతో తమిళ ప్రేక్షకులకు పరిచయమైన ఆమె, అక్కడ కూడా అవకాశాలు అందుకుంటోంది. ఇక తాజాగా ధనుష్ హీరోగా రాజ్ కుమార్ పెరియాసామి దర్శకత్వంలో రూపొందుతున్న 'డి55' (వర్కింగ్ టైటిల్) ప్రాజెక్ట్‌లో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రాన్ని వండ్ బార్ సంస్థ నిర్మిస్తోంది. ఇందులో సాయి పల్లవి కూడా కీలక పాత్రలో కనిపించనుండటం ఆసక్తిని పెంచుతోంది. ఈ సినిమా ద్వారా కోలీవుడ్‌లో తన స్థానం మరింత బలపరచుకోవచ్చని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

ఇదిలా ఉంటే, ఇప్పుడు మరో క్రేజీ ప్రాజెక్ట్ విషయంలో శ్రీలీల పేరు గట్టిగా వినిపిస్తోంది. తమిళ స్టార్ అజిత్ కుమార్ హీరోగా తెరకెక్కనున్న కొత్త చిత్రంలో ఆమె హీరోయిన్‌గా ఎంపికయ్యే అవకాశముందని టాక్ నడుస్తోంది. 'గుడ్ బ్యాడ్ అగ్లీ' తర్వాత రేసింగ్‌పై దృష్టి పెట్టిన అజిత్, అదే చిత్ర దర్శకుడు అధిక్ రవిచంద్రన్ తో మరోసారి చేతులు కలపబోతున్నట్లు సమాచారం. ఈ ప్రాజెక్ట్ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందనుందని చెబుతున్నారు. ఈ సినిమాలో అజిత్‌కు సమానంగా బలమైన మహిళా పాత్ర ఉండేలా కథను డిజైన్ చేస్తున్నారని కోలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఆ పాత్ర కోసం శ్రీలీల పేరును పరిశీలిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఒకవేళ ఈ కాంబినేషన్ కుదిరితే, శ్రీలీల కెరీర్‌లో ఇది కీలక మైలురాయిగా మారే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

## పెళ్లికోసం ఉదయ్‌పూర్‌కు విజయ్



**టాకీస్:** టాలీవుడ్ క్రేజీ జంట విజయ్ దేవరకొండ- రష్మిక మందన్నా పేర్లు గత కొద్ది రోజులుగా నెట్టింట హాట్ టాపిక్‌గా మారుతున్నాయి. వీరిద్దరి మధ్య సమ్‌థింగ్ సమ్‌థింగ్ నడుస్తుందని ప్రచారం జరుగుతున్న వేళ ఎట్టకేలకు వధూవరులుగా పెళ్లిపీటలు ఎక్కబోతున్నారు. ప్రేమ, పెళ్లిపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ఇచ్చిన తరువాత పెళ్లి వేడుకల సందడి మొదలైంది. ఈ నెల 26న వివాహం జరగనుండగా, వేడుక కోసం ఈ జంట రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌కు బయల్దేరింది. ఎయిర్‌పోర్ట్‌లో కనిపించిన వీరి వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. విజయ్ వెంట ఆయన సోదరుడు ఆనంద్ దేవరకొండ ఉన్నారు. ఇప్పటికే ఉదయపూర్ ప్యాలెస్‌లో ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో ఈ వివాహం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం. గత కొంతకాలంగా వీరి ప్రేమ, పెళ్లిపై వార్తలు జోరందుకున్నాయి. సోషల్ మీడియాలో ఒకే పోస్ట్‌తో పెళ్లి విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. అభిమానులు ప్రేమగా పిలిచే 'విరోష్' పేరునే తమ వివాహానికి శీర్షికగా పెట్టామని పేర్కొన్నారు. మీరు ప్రేమగా పెట్టిన పేరు 'విరోష్'. మీ అందరి ఆశీర్వాదాలతో జంటగా మీ ముందుకు వస్తున్నాం. 'ది వెడ్డింగ్ ఆఫ్ విరోష్" అంటూ ఎమోషనల్‌గా రాసుకొచ్చారు. ఉదయపూర్‌లో పెళ్లి అనంతరం మార్చి 4న హైదరాబాద్‌లో రిసెప్షన్ ఏర్పాటు చేయనున్నారు. నగరంలోని ఓ లగ్జరీ హోటల్‌లో వేడుకకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. టాలీవుడ్ టాప్ సెలబ్రిటీలు, పలువురు రాజకీయ ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నట్టు సమాచారం. అభిమానులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఈ కలల కపుల్ పెళ్లి వేడుక సోషల్ మీడియాలో మరింత సందడి చేయనుంది.

## త్రివిక్రమ్-వెంకీ కాంబోలో ఏకే 47




**టాకీస్:** టాలీవుడ్‌లో రాబోతున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆదర్శ కుటుంబం ఎకె 47' విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబోలో వస్తున్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదల చేసిన పోస్టర్లకు మంచి స్పందన వచ్చింది. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ ప్రాజెక్టు సంబంధించిన ఆసక్తికర అప్‌డేట్ బయటకు వచ్చింది. ఇప్పటివరకు 40 శాతం షూటింగ్ పూర్తవగా వెంకీ టీం దుబాయ్‌కు వెళ్లనుందట. 10 రోజులపాటు దుబాయ్‌లో సాగనున్న షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలను ప్లాన్ చేసిందట త్రివిక్రమ్ టీం. దుబాయ్‌లో వచ్చే సీన్లు సినిమాను ఎలివేట్ చేసేలా రిచ్‌గా ఉండబోతున్నాయని ఇన్‌సైడ్ టాక్. అంతేకాదు ఈ మూవీలో పాపులర్ తమిళ కమెడియన్ యోగిబాబు కూడా నటిస్తున్నట్టు తెలుస్తోందగా.. మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అన్నీ అనుకున్నట్టుగా కుదిరితే సినిమా షూటింగ్ జూన్ కల్లా పూర్తి కానుందని సమాచారం.ఇప్పటికే 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' వంటి హిట్ చిత్రాలకు రైటర్ హీరో కాంబోగా కలిసి పనిచేసిన త్రివిక్రమ్-వెంకీ ఇప్పుడు డైరెక్టర్ హీరోగా మొదటిసారి చేతులు కలపడంతో సినిమాపై క్యూరియాసిటీ పెరిగిపోతోంది. ఇటీవల విడుదలైన టైటిల్ అనౌన్స్‌మెంట్, ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచేస్తున్నాయి.ఈ సినిమాలో కేజీఎఫ్ ఫేం శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తుండగా, నారా రోహిత్ కీలక పాత్రలో కనిపించనున్నాడు. ఈ మూవీని హారికా అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై ఎస్. రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌తోపాటు క్రైం ఎలిమెంట్స్‌తో ఈ సినిమా ఉండబోతుందని తెలుస్తోంది.

## ఆరా ఆఫ్ ఉస్తాద్ రెండో పాట విడుదల

**టాకీస్:** పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ గురించి దర్శకుడు హరీష్ శంకర్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. పవన్ కళ్యాణ్ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం మార్చి 26న విడుదల కానుంది. ఈ చిత్రంలో శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమాకు దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మూవీ ప్రమోషన్ కార్యక్రమాలు జోరుగా జరుపుకుంటుంది. ఇందులో భాగంగా 'ఆరా ఆఫ్ ఉస్తాద్' అనే రెండో పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా హరీష్ శంకర్ మాట్లాడుతూ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.పవన్ కళ్యాణ్ రెండు దశాబ్దాలుగా మెడపై చెయ్యి వేసుకునే మేనరిజాన్ని గుర్తు చేస్తూ, దానికి మాటల రూపం ఇవ్వాలని ఆలోచించానని 'నేను మెడ ముట్టుకుంటే తొడ కొట్టినట్టే' అనే డైలాగ్ వచ్చిందన్నారు. ఈ హుక్ లైన్ చెప్పగానే డీఎస్పీ ఉత్సాహంగా స్పందించారని తెలిపారు. మాస్ హుక్ లైన్‌లో కూడా ఫిలాసఫీ చెప్పొచ్చని దేవిశ్రీ ప్రసాద్ తనకు కాంప్లిమెంట్ ఇచ్చారని చెప్పారు. ఈ పాటను రచయిత చంద్రబోస్ కేవలం రెండు రోజుల్లో ఎనిమిది గంటల్లో రాశారని వెల్లడించారు. ఇది కేవలం అభిమానంతో రాసిన పాట కాదు. పవన్ కళ్యాణ్ లైఫ్ స్టైల్, ఆయన ఖర్చీపై అవగాహనతో వచ్చిన పాట. ఆయన వ్యక్తిత్వం, కష్టపడే స్వభావం ఈ పాటలో ప్రతి లైన్‌లో కనిపిస్తుంది.




Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.